
JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి । ఆదివారం 16-11-2025
Medchal - Malkajgiri । Sunday 16-11-2025
jayabherinews
సంపుటి : 02 । సంచిక : 170 । పేజీలు : 8 । వెల : 5
Vol. 02 । Issue 170 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com




## రేవంత్ సైలెంట్ వార్నింగ్




జయభేరి, హైదరాబాద్, నవంబర్ 15:

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వానికి జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక మరింత ఊపు తెచ్చింది. రెండేళ్లలో రెండు ఉప ఎన్నికలలో కాంగ్రెస్ ను రేవంత్ ఒంటి చేత్తో గెలిపించారు. గత రెండేళ్లలో రేవంత్ రెడ్డి నాయకత్వంపై అనేక ప్రచారాలు జరుగుతున్నాయి. బీహార్ ఎన్నికల తర్వాత తెలంగాణలో ముఖ్యమంత్రిని మారుస్తారన్న ప్రచారం జరిగింది. అలాగే కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల ప్రభావం కూడా ఈ ఉప ఎన్నికల్లో పనిచేయలేదు. ప్రత్యర్థులు చేసే విమర్శలను ప్రజలు పెద్దగా పట్టించుకోలేదన్నది ఈ ఎన్నిక ఫలితం ద్వారా చూడాలి. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి అంత సులువుగా ఎంపిక కాలేదు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చినా నాటి రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం రెండుసార్లు జరిగిన ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తేవడంలో విఫలమయింది... అందుకే టీడీపీ నుంచి వచ్చినా రేవంత్ రెడ్డిలో ఉన్న ఫైర్ ను చూసి కాంగ్రెస్ నాయకత్వం పీసీసీ చీఫ్ బాధ్యతలను అప్పగించింది. అప్పటి నుంచి నాడు పదేళ్ల నుంచి అధికారంలో ఉన్నకేసీఆర్ పై రేవంత్ రెడ్డి మాటల దాడి కూడా ప్రజలను ఆకట్టుకుంది. ఫలితంగా 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. అందువల్లనే ఢిల్లీ నాయకత్వం రేవంత్ రెడ్డికి ముఖ్యమంత్రి పదవి అప్పగించింది.

# కారు గ్యారేజీకేనా..?

బీఆర్ఎస్ కు నష్టం చేకూర్చింది. ముఖ్యమంత్రిగా ఉన్న పదేళ్ల కాలంలో కేసీఆర్ వ్యవహరించిన తీరును, ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహార శైలిని ప్రజలు బేరీజు వేసుకున్నట్లే ఉంది. నాడు కేసీఆర్ జనాలకు దగ్గరగా వచ్చే వారు కాదు. ఏ కార్యక్రమానికి హాజరయ్యే వారు కాదు. కానీ మొన్న తెలంగాణ కవి అందెశ్రీ మరణించినసమయంలో రేవంత్ రెడ్డి వ్యవహరించిన తీరు కూడా అందరినీ కట్టిపడేసింది. ఇలా అనేక కారణాలు కారు కు హ్యాండ్ బ్రేక్ వేసినట్లయింది.

**జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఫలితాలు బీఆర్ఎస్ శ్రేణులను మరింత కుంగ దీశాయి. సిట్టింగ్ స్థానాలను రెండింటిని గత రెండేళ్లలో కోల్పోవడం కూడా క్యాడర్ ఆత్మస్థయిర్యాన్ని దెబ్బతీసింది. ఈ ఓటములకు కారణం అభ్యర్థులు కాదు.. కేవలం పార్టీ నాయకత్వమేనని స్పష్టంగా చెప్పాలి.**

జయభేరి, హైదరాబాద్, నవంబర్ 15:

కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా గెలిచిన మాజీ ఎమ్మెల్యే సాయన్న కుమార్తె లాస్య నందిత దురదృష్టవశాత్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఎమ్మెల్యేగా గెలిచిన నెలలు తిరగక ముందే ఆమె మరణించడంతో సాయన్న మరో కుమార్తె నివేదితను పోటీకి దింపారు. కానీ నాడు ఆ ఎన్నికల్లో బీజేపీ రెండో స్థానంలో గెలవగా, మూడో స్థానానికి బీఆర్ఎస్ పరిమితమయింది. ఇప్పుడు కూడా అన్ని పార్టీల కంటే జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభ్యర్థిని బీఆర్ఎస్ ప్రకటించింది. తమ పార్టీకి చెందిన మాగంటి గోపీనాథ్ సతీమణి మాగంటి సునీతను అభ్యర్థిగా ప్రకటించారు. అయినా రెండుసార్లు బీఆర్ఎస్ గెలుపు సాధించలేదు. అంటే ఇక్కడ అభ్యర్థుల కంటే నాయకత్వాన్ని మాత్రమే ప్రజలు చూశారని చెప్పాల్సి ఉంటుంది. గత రెండేళ్లుగా పార్టీ అధినేత కేసీఆర్ ప్రజా సమస్యలపై పెద్దగా బయటకు రావడం లేదు. అప్పుడప్పుడు బయటకు వచ్చి వెళ్లడం తప్ప ఆయన ఎక్కువగా ఫామ్ హౌస్ కే పరిమితమయ్యారు. ఆరోగ్యం పరిస్థితులు కూడా ఆయనను బయటకు రానివ్వడం లేదు. దీంతో జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికల ప్రచారాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నీ తన భుజాల మీద వేసుకుని చేశారు. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రచారంలో ముమ్మరంగా పాల్గొన్నారు. అయితే ప్రచారంలో

...మిగతాది 2 లో

## ఇంధన రంగంలో సైబర్ రక్షణ అత్యవసరం

- ఏఐ ద్వారా విద్యుత్ పంపిణీ, సరఫరా నష్టాలు తగ్గించే చర్యలు
- ఎక్కడికక్కడ విద్యుత్ ఉత్పత్తి చేసేలా ప్రణాళికలు
- ప్రజలకు లబ్ది కలిగేలా విద్యుత్ వ్యవస్థలను తీర్చిదిద్దుతాం
- సెంటర్ ఫర్ ఎనర్జీ సైబర్ రెజిలియన్స్ సెంటర్-CECRC ఏర్పాటుపై ఎంఓయూ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం బాబు
- ఇంధన భద్రత, టెక్నాలజీ వినియోగం కోసం CECRC ఏర్పాటుకు ఎంఓయూ కుదుర్చుకున్న రాష్ట్ర ప్రభుత్వం
- సీఎం చంద్రబాబు సమక్షంలో వరల్డ్ ఎకనమిక ఫోరంతో రాష్ట్రం కీలక ఒప్పందం
- తక్కువ వ్యయంతో నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తే లక్ష్యంగా పని చేస్తున్నాం: మంత్రి నారా లోకేష్



జయభేరి, విశాఖపట్టణం, నవంబర్ 15:

ఇంధన భద్రత కోసం మెరుగైన రక్షణ విధానాన్ని ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ఇదే సమయంలో టెక్నాలజీని వినియోగించి... ప్రజలకు లబ్ది కలిగేలా విద్యుత్ ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలు

...మిగతాది 2 లో

## 24 గంటలు గడవకముందే కాంగ్రెస్ పార్టీ రౌడీయిజం



- జూబ్లీహిల్స్ రహమత్‌నగర్‌లో కాంగ్రెస్ గూండాల దాడిలో గాయపడిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త రాకేశ్
- పరామర్శించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

జయభేరి, హైదరాబాద్ నవంబర్ 15:

జూబ్లీహిల్స్ ఎన్నికల ఫలితాలు వచ్చి 24 గంటలు గడవక ముందే కాంగ్రెస్ పార్టీ రౌడీయిజం, గుండాయిజం మొదలు పెట్టిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ కార్యకర్తపై జరిగిన దాడిని ఖండించారు. తాము పదేండ్లు అధికారంలో ఉన్నామని, ఎన్నో ఉప ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందినా ఎప్పుడు కూడా కాంగ్రెస్ పార్టీ వలే ప్రతిపక్షాలపై దాడులు చేయలేదన్నారు. జూబ్లీహిల్స్ రహమత్‌నగర్‌లో కాంగ్రెస్ గూండాల దాడిలో గాయపడిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త రాకేశ్‌ను కేటీఆర్ పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. కార్యకర్తలు ఎవ్వరూ దిగులు చెందొద్దని, కాంగ్రెస్ చేస్తున్న రౌడీయిజాన్ని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీలోని ప్రతి

...మిగతాది 2 లో




## ముహూర్తం ఖరారు

- సర్పంచ్ ఎన్నికల నోటిఫికేషన్‌కు లైన్ క్లియర్
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక విజయం తర్వాత కాంగ్రెస్ కు ఆత్మవిశ్వాసం పెరిగిపోయింది
- ఈ నెల 17వ తేదీన తెలంగాణ కేబినెట్ సమావేశం
- రిజర్వేషన్ల అంశం ప్రభుత్వం ముందు ఉన్న అతిపెద్ద సవాలు
- ఎన్నికల నోటిఫికేషన్ ఈ నెలాఖరులోగా లేదా తదుపరి నెల మొదటి వారంలోగా వచ్చే అవకాశాలు

జయభేరి, హైదరాబాద్ :

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక విజయం అధికార కాంగ్రెస్ ప్రభుత్వానికి ఊహించని ఉత్సాహాన్ని, రాజకీయంగా కొత్త బలాన్ని ఇచ్చింది.

...మిగతాది 2 లో

## కెసిఆర్ కళ్లకు గంతలు కట్టి బిఆర్ఎస్ ను అధోగతిపాలు చేస్తున్నారు



జయభేరి, మెదక్, నవంబర్ 15 :

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితం చూశాక బిఆర్ఎస్ ప్రతిపక్షంగా సరైన పాత్ర పోషించటం లేదని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలిపారు. ఎక్కడ చూసిన కాంగ్రెస్ పై ప్రజల్లో వ్యతిరేకత ఉందని, అయిన సరే కాంగ్రెస్ ఎందుకు గెలిచిందని ప్రశ్నించారు. అనుకున్న స్థాయిలో ప్రతిపక్షంగా బిఆర్ఎస్ పనిచేయకపోవడంతో జాగృతి సంస్థ ప్రశ్నించే శక్తిగా ప్రజల వజ్రాయుధంగా మారుతుందన్నారు. మెదక్ జిల్లాలో జాగృతి జనంబాటలో

...మిగతాది 2 లో




## ఆ రంగాల్లో వచ్చే ఏడాదిలోపు వేలల్లో ఉద్యోగాలు

- తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం!

జయభేరి, హైదరాబాద్ , నవంబర్ 15:

తెలంగాణను 2030 నాటికి దేశ 'ఏరో ఇంజిన్ రాజధాని'గా తీర్చిదిద్దాలన్నదే

మొదటిపేజీ తరువాయి

## కారు గ్యారేజీకేనా..?

కూడా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం తప్ప మరొకటి లేకుండాఉంది... పోల్ మేనేజ్ మెంట్ లో బీఆర్ఎస్ పార్టీ ఘోరంగా విఫలమయింది. కారుకు, బుల్ డోజర్ కు మధ్య పోటీ అంటూ పదే పదే ప్రచారం చేసినా ఆక్రమణల విషయంలో ప్రజలు బుల్ డోజర్ వైపు మొగ్గు చూపారనుకోవాలి. డబ్బులు తక్కువ ఖర్చు పెట్ట లేదనుకోవడం పొరపాటే. కాంగ్రెస్ తో పోటీ పడిందనే చెప్పాలి. అదే సమయంలో కాంగ్రెస్ అభ్యర్థి రౌడీషీటర్ అని ప్రచారం ఒక పక్క చేస్తూ మరికొందరి రౌడీషీటర్లకు పార్టీ కండువాలు కప్పడం కూడా బీఆర్ఎస్ చేసిన తప్పిదాల్లో ఒకటి. ఇక సీమాంధ్ర ఓటర్లను ఆకట్టుకోవడంలో కూడా కేటీఆర్ విఫలమయ్యారు. టీడీపీ తటస్థంగా ఉండటం కూడా కాంగ్రెస్ కు లాభించింది. బీఆర్ఎస్ కు నష్టం చేకూర్చింది. ముఖ్యమంత్రిగా ఉన్న పదేళ్ల కాలంలో కేసీఆర్ వ్యవహరించిన తీరును, ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహార శైలిని ప్రజలు బేరీజు వేసుకున్నట్లే ఉంది. నాడు కేసీఆర్ జనాలకు దగ్గరగా వచ్చే వారు కాదు. ఏ కార్యక్రమానికి హాజరయ్యే వారు కాదు. కానీ మొన్న తెలంగాణ కవి అందెశ్రీ మరణించినసమయంలో రేవంత్ రెడ్డి వ్యవహరించిన తీరు కూడా అందరినీ కట్టిపడేసింది. ఇలా అనేక కారణాలు కారుకు హ్యాండ్ బ్రేక్ వేసినట్లయింది. మొత్తం మీద కేటీఆర్ చెప్పినట్లుగా తమను ప్రత్యామ్నాయంగా ప్రజలు చూస్తున్నారని చెప్పేకంటే ఎలా బలోపేతం కావాలో అవసరమైన చర్యలతో జనం ముందుకు వెళ్లాలి. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాలే తమను గెలిపిస్తాయని భావిస్తే మాత్రం జరిగే ఏ ఎన్నికల్లోనైనా కారు పార్టీకి భంగపాటు తప్పదన్నవిషయాన్ని గుర్తుంచుకోవాలి. వచ్చేస్థానిక సంస్థలఎన్నికల్లోనైనా, జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనైనా బీఆర్ఎస్ నాయకత్వం తమ పంథాను మార్చుకోకుండా వ్యవహరిస్తే మరోసారి ఓటమిని రుచిచూడక తప్పదని గుర్తుంచుకుంటే మంచిది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఈ ఎన్నికలు రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీకి తామే ప్రధాన ప్రత్యర్థి అని తేల్చిచెప్పినట్లయిందని కేటీఆర్ అన్నారు. తాము గత శాసనసభ ఎన్నికల్లో ఓటమి పాలయినప్పటికీ ప్రజా సమస్యలపై స్పందించామని కేటీఆర్ తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ కు ప్రత్యామ్నాయం బీఆర్ఎస్ మాత్రమేనని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు చెప్పినట్లయిందని కేటీఆర్ అన్నారు. గెలుపు, ఓటములు పక్కన పెడితే ప్రజాస్వామ్యంపై చర్చ జరగాలని అన్నారు. ఈ ఎన్నిక ఎలా జరిగిందన్నది ప్రజల్లో కూడా చర్చ జరగాలన్నారు. ఎన్నికలకు ముందే తాము అనేక విషయాలు బయటకు తెచ్చినా ఎన్నికలకమిషన్ పట్టించుకోలేదన్నారు. ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని,దొంగ ఓట్లు పోలయ్యాయని చెబుతున్నాఎవరూ తమ మొరను విన లేదన్నారు. ఈ ఓటమితో తాము నిరాశ చెందడం లేదని, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ వెళతామని కేటీఆర్ చెప్పారు.

## కెసిఆర్ కళ్లకు గంతలు కట్టి..

భాగంగా కవిత మాట్లాడారు. సోషల్ మీడియాలోనే వాళ్లు యుద్ధం చేస్తున్నారు కానీ ప్రజల్లోకి రావటం లేదన్నారు. కృష్ణార్జునులు అనుకునే వాళ్లు ఒకరి జబ్బలు ఒకరు చరుచుకుంటున్నారని, కానీ పెద్ద ఎత్తున ప్రజల కోసం వారి సమస్యల కోసం పనిచేయటం లేదని చురకలంటించారు. అవినీతి తెలియకూడదని.. సిసి కెమెరాలను ఆఫ్ చేసిన సిబ్బంది. జూబ్లీహిల్స్ లో విత్ డ్రా చేసుకోవాలని కొంతమంది తన దగ్గరి వచ్చారని, తమ పార్టీకి మద్దతు ఇవ్వాలని అడిగారని, తాను బిఆర్ఎస్ లో లేనని చెప్పానన్నారు. మాజీ మంత్రి హరీష్ రావు తండ్రి మరణించినా కూడా పార్టీ కోసం టెలికాన్ఫరెన్స్ మాట్లాడుతూ పనిచేశారని ఆయన భజనపరులు మోశారని, ఇప్పుడు జూబ్లీహిల్స్ లో ఓడిపోవటంతో హరీష్ రావు ఉంటే ఫలితం వేరేలా ఉండేదని ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. హరీష్ రావు లేకపోతే మాజీ సిఎం కెసిఆర్ లేరని, తెలంగాణ ఉద్యమమే లేదన్నట్లుగా ప్రచారం చేస్తారని కవిత ధ్వజమెత్తారు. కెసిఆర్ కళ్లకు గంతలు కట్టి బిఆర్ఎస్ ను అధోగతి పాలు చేస్తున్నారని కవిత దుయ్యబట్టారు. ఈ అరాచకాలు కెసిఆర్ కు తెలిసి ఉంటే ఆయన ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించే వారు కాదు అని, రామన్న సోషల్ మీడియాను వదిలి ప్రజల్లోకి వెళ్లాలన్నారు. మెదక్ జిల్లాలో నాలుగు మున్సిపాలిటీ లు ఉన్నాయని, కెసిఆర్ ప్రభుత్వంలో మెదక్ కు రూ. 50 కోట్లు, మిగతా వాటికి రూ. 25 కోట్లు కేటాయించారని, ఆ నిధులు వచ్చాయో లేదో తనకు తెలియదన్నారు. రామాయం పేట మాత్రం వర్షాలకు మునిగిపోయిందని, అక్కడి ప్రజలను పలకరిస్తే కన్నీళ్లు పెట్టుకుంటున్నారని, కొత్తగా అయినా మండలాలు, రెవెన్యూ డివిజన్లకు ఆఫీస్ లేవని దుయ్యబట్టారు. కొత్తగా జిల్లా ఏర్పడి 12 ఏళ్లు అయినప్పటికీ ఎందుకు అభివృద్ధి ఫలాలు ఎందుకు దక్కడంలేదని ప్రశ్నించారు.

## వచ్చే ఏడాదిలోపు వేలల్లో ఉద్యోగాలు

రాష్ట్ర ప్రభుత్వ స్పష్టమైన దిశ అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. గచ్చిబౌలి ఐఎస్బీలో జరిగిన 'ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ సమ్మిట్'లో ఆయన కీలకోపన్యాసం చేశారు. ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలలో ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న వేగవంతమైన మార్పులను తెలంగాణ తనకు అనుకూలంగా మార్చుకునే దిశగా పనిచేస్తుందన్నారు. గచ్చిబౌలి ఐఎస్బీలో సమ్మిట్ను కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్మెంట్, ఐఎస్బీ, ముంజాల్ ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ కలిసి నిర్వహించిన 'ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ సమ్మిట్'కు తెలంగాణ ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలలో ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న వేగవంతమైన మార్పులను తెలంగాణ తనకు అనుకూలంగా మార్చుకునే దిశగా పనిచేస్తుందన్నారు. ప్రపంచంలో గ్లోబల్ సప్లై చెయిన్ ఒత్తిడికి గురవుతున్న సందర్భంలో నమ్మకమైన తయారీ కేంద్రాల కోసం ప్రపంచం భారత్ వైపు చూస్తోందని, ఇది తెలంగాణకు పెద్ద అవకాశమని అన్నారు. గతేడాది దేశ రక్షణ ఉత్పత్తుల విలువ రూ.1.5 లక్షల కోట్లను దాటడం, రక్షణ ఎగుమతులు 12 శాతం వృద్ధి నమోదు చేయడం దేశ శక్తిని సూచిస్తోందని వివరించారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంలో ఏరోస్పేస్, డిఫెన్స్ రంగం కీలక భాగం కానుందని మంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో 25కి పైగా అంతర్జాతీయ, జాతీయ ఏరోస్పేస్ డిఫెన్స్ కంపెనీలు, 1,500కి పైగా ఎంఎస్ఎంఈలు తెలంగాణ బ్రాండ్ను ప్రపంచానికి తీసుకెళ్తున్నాయని తెలిపారు. రాష్ట్ర ఏరోస్పేస్ ఎగుమతుల విలువ 2023-24లో రూ.15,900 కోట్లుగా ఉండగా, 2024-25లో తొలి తొమ్మిది నెలల్లోనే రూ.30,742 కోట్లకు పెరగడం ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాల విజయాన్ని చూపిస్తోందని మంత్రి చెప్పారు.

## ముహూర్తం ఖరారు

ఈ గెలుపును పునాదిగా చేసుకుని.. ముఖ్యంగా... గ్రామీణ ప్రాంతాల్లో తమ పట్టును మరింత బలోపేతం చేసుకోవడానికి ఈ ఎన్నికలను ఒక సువర్ణావకాశంగా కాంగ్రెస్ భావిస్తోంది. ఈ మేరకు ఈ నెల 17వ తేదీన తెలంగాణ కేబినెట్ సమావేశం నిర్వహించనున్నారు. దీనిలో స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్ణయం తీసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి బీసీ వెనుకబడిన తరగతుల, రిజర్వేషన్ల అంశం ప్రభుత్వం ముందు ఉన్న అతిపెద్ద సవాలుగా మారింది. గతంలో ప్రవేశపెట్టిన 42 శాతం బీసీ రిజర్వేషన్లకు చట్టపరమైన లీగల్, సమస్యలు, అడ్డంకులు ఎదురవుతున్న నేపథ్యంలో, అధికారులు మరో నివేదికను సిద్ధం చేశారు. **సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం:** షెడ్యూల్డ్ కులాలు ఎస్సీ, షెడ్యూల్డ్ తెగలు ఎస్టీ బీసీలకు కలిపి మొత్తం రిజర్వేషన్లు ఎట్టి పరిస్థితుల్లోనూ 50 శాతం మించకూడదు. ఈ న్యాయపరమైన పరిమితిని దృష్టిలో ఉంచుకుని..మొత్తం 50 శాతం పరిమితిలోనే బీసీలకు రిజర్వేషన్లు కేటాయించేలా అధికారులు మార్గాలను అన్వేషించారు. దీనికి సంబంధించి ఒక సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు. బీసీ రిజర్వేషన్లను 50 శాతం పరిమితికి లోబడి కేటాయించడం వల్ల, కొన్ని వర్గాల నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశం ఉందని ముఖ్యమంత్రి భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో, ముఖ్యమంత్రి మంత్రులకు కీలక సూచనలు ఇచ్చినట్లు సమాచారం. బీసీల నాయకులతో, ప్రజాప్రతినిధులతో మాట్లాడి న్యాయపరమైన చిక్కుల కారణంగానే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని, ఇది కేవలం తాత్కాలికమేనని వివరించాలని ఆయన సూచించినట్లు తెలుస్తోంది. బీసీ సంక్షేమం పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని, భవిష్యత్తులో వారికి మరింత న్యాయం చేసే ప్రణాళికలను వివరించడం ద్వారా ఎన్నికలకు వెళ్లాలని కాంగ్రెస్ వ్యూహం రచిస్తోంది. ప్రస్తుత పరిణామాలు గమనిస్తే.. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ ఈ నెలాఖరులోగా లేదా తదుపరి నెల మొదటి వారంలోగా వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఈ ఎన్నికలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీకి కొత్త స్థానిక నాయకత్వాన్ని అందించి, పార్టీ బేస్ ను మరింత బలోపేతం చేస్తాయని ప్రభుత్వం ఆశిస్తోంది. అలాగే.. ఎన్నికల తర్వాత కూడా తమ ఆరు గ్యారంటీల అమలుకు స్థానిక సంస్థల ద్వారా మరింత వేగం పుంజుకోవచ్చని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ స్థానిక ఎన్నికలు తెలంగాణ రాజకీయాలపై, ముఖ్యంగా గ్రామీణ ఓటర్లపై కాంగ్రెస్ పట్టును స్పష్టంగా తెలియజేస్తాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక విజయం తర్వాత కాంగ్రెస్ కు ఆత్మవిశ్వాసం పెరిగిపోయింది.

# ఇచ్చుట.. క్షమించుట నిజమైన మానవత్వము






Dr. హరి హర నాద రాజు
శంబాలా 360 సొల్యూషన్స్
9177 445 591
www.shambala360solutions.com

జయభేరి, హైదరాబాద్ :

మానవుడు అంటే మానవుని ఆకారం మాత్రమే కాదు. మానవత్వపు గుణములు కలిగి ఉన్నవాడే నిజమైన మానవుడు. మానవుడుగా జన్మించి కేవలం పశుగుణములు కలిగి ఉన్నవాడు ఆకార మానవుడే కానీ ఆచార మానవుడు కాదు. సత్యము ధర్మము శాంతి ప్రేమ అహింస అనే ఈ ఐదు గుణములు మానవతా గుణములుగా చెప్పి ఉన్నారు శంభాల తల్లి అయితే వీటిలో ఒక్క ప్రేమను పెంచుకుంటే మిగిలిన విలువలు సునాయాసంగా వస్తాయని కూడా చెప్పారు. ప్రేమగా మాట్లాడితే అది సత్యం అవుతుంది. ప్రేమను ఆచరిస్తే ధర్మము, ప్రేమను అనుభవంలోనికి తెచ్చుకుంటే శాంతి ,ప్రేమను అర్థం చేసుకుంటే అహింస అవుతుంది. అయితే ప్రేమంటే ఏమిటి ? ప్రేమంటే ఏమిటో శంభాల తల్లి ఒక్క వాక్యంలో చెప్పారు. ఇతరులకు అవసరమైనది ఇవ్వటం ద్వారా ఇతరులు చేసిన పొరపాట్లను క్షమించడం ద్వారా ప్రేమను అభివృద్ధి చేసుకోవచ్చు అని అర్థం! ఒక వ్యక్తి మీద మన ప్రేమను ఎలా వ్యక్తం చేస్తాము? వారికి అవసరమైనది అందించడం ద్వారా మన ప్రేమను చూపిస్తాము. అయితే మన దగ్గర ఎక్కువగా వృథాగా ఉన్న వాటిని ఇవ్వటం కాదు ..ఎదుటి వ్యక్తికి ఏది అవసరమో, ఏది ఇస్తే సంతోషపడతారో అది ఇవ్వగలగాలి. అమ్మ ప్రేమ అనిర్వచనీయమైనది . అమ్మ తనకోసం ఉంచుకున్న వాటిని కూడా మనకు అందిస్తుంది. అమ్మకు మనలో ఏ పొరపాట్లు కనిపించవు. ఒకవేళ మనలో ఏదైనా దోషములు ఉన్నా వాటిని వెంటనే క్షమించి వేస్తుంది. ప్రేమను పంచటంలో అమ్మ కన్నా ఆదర్శం మనకు ఎవరూ కనిపించరు. అందుకే "సన్నజాజి కన్న, సంపంగి లత కన్న, వెన్నకన్న, జున్ను గడ్డకన్న కన్నతల్లి ప్రేమ సున్నితంబు అన్నారు. అయితే ఇతరులకు ఇచ్చేటప్పుడు నేను ఎక్కువ స్థాయిలోనున్న గొప్ప వ్యక్తిని అనే అహంకార భావంతో కాకుండా వినయంతో ఇవ్వాలి.. అప్పుడే మనలో మానవత్వం అభివృద్ధి అవుతుంది.

ఇవ్వటం అంటే కేవలం వస్తురూపంలోనే కాదు. మన జీవితంలోని కొంత సమయాన్ని(Time)మన శరీరంలోని కొంత శక్తిని(Energy ) మనలోని నైపుణ్యాన్ని( skill) ఇతరులకు అందించినప్పుడు ఇవ్వటం అనే స్థాయి నుంచి పంచుకొనటం(sharing )అనే స్థాయికి చేరుతుంది. ప్రేమతో, వినయంతో మనం ఇచ్చినప్పుడు మనం ఇచ్చిన దానికంటే ఎక్కువగా పొందగలుగుతాం అని శంభాల తల్లి చెబుతారు.

శ్రీకృష్ణుని వేలికి దెబ్బ తగిలినప్పుడు ద్రౌపది వెంటనే తన ధరించిన చీరలోని చిన్న ముక్కను చించి శ్రీకృష్ణుని వ్రేలికి కట్టు కట్టింది. దానికి బదులుగా శ్రీకృష్ణ పరమాత్మ ద్రౌపదికి ఆపద కలిగిన సమయంలో తను తీసుకున్న చిన్న చీర ముక్కని అక్షయం చేసి ఆవిడకి కొన్ని వందల చీరలు అందించాడు. అయితే మనం ఏది ఆశించకుండా అవసరంలో ఉన్నవారికి నిస్వార్థంగా ఇవ్వటమే మానవత్వానికి ప్రతీక. నిజానికి మనం లోతుగా ఆలోచిస్తే నిస్వార్థంగా ,ఇవ్వడంలో పొందే ఆనందం తీసుకొనుటలో లేదని గ్రహించగలుగుతాం! ఇవ్వటంలోనే నిజమైన ఆనందం ఉంది. మన జీవితంలో తల్లిదండ్రుల నుంచి, బంధువుల నుంచి, స్నేహితుల నుంచి ఇలా ఎన్నో తీసుకుంటున్నాం .అయితే అది తాత్కాలిక సంతోషమే. తర్వాత అన్ని మర్చిపోతాం. కానీ ఎవరైనా ఆకలితో బాధ పడుతున్నప్పుడు మనం పెట్టే కొద్ది ఆహారం గానీ, ఎవరైనా సమస్యలతో బాధతో కృంగిపోతున్నప్పుడు మనం ఆప్యాయతతో పలకరించి మంచి సలహాతో వాళ్లకు భరోసా ఇచ్చినప్పుడు కానీ వారి కళ్ళలో చూసే ఆనందం మన జీవితాంతం గుర్తుండిపోతుంది .ఇదే ఇవ్వడంలో ఉండే ఆనందం .మన జీవితానికి అర్థము పరమార్థము ఇదే కదా!

### ప్రకృతియే ఉత్తమమైన గురువు

మనం ఒక్కసారి ప్రకృతిని పరిశీలిస్తే ఇవ్వటం అంటే ఏమిటో తెలుస్తుంది .చెట్లు, మొక్కలు పువ్వులను ,పండ్లను, స్వచ్ఛమైన గాలిని, నీడను, చివరకు అవి మరణించిన తర్వాత కూడా కట్టెల రూపంలోనూ మనకు జీవితాంతం అందిస్తూనే ఉంటాయి.

బ్రతికినన్నాళ్ళు ఫలములిచ్చుటే కాదు.. చచ్చికూడా చీల్చి ఇచ్చు తనువు.. త్యాగభావమునకు తరువులే గురువులు.. ఉన్న మాట తెలుపుచున్నమాట

పూల మొక్కలు ఉదయమే తన దగ్గర ఉన్న మనోహరమైన పరిమళాన్ని అందించే పూలను మనకు ఇవ్వటానికి సిద్ధంగా ఉంటాయి. అందుకే అవి ఎప్పుడు నిరాశలో ఉన్నట్లు కనిపించవు. ఎప్పుడూ కళకళలాడుతూ ఆహ్లాదంగా కనిపిస్తాయి. వాటికి ఆనందం అంతా ఇవ్వటంలోనూ, పంచుకొనుట లోను వచ్చాయని మనం గ్రహించగలం.

జంతువులు అన్నీ మన నిత్య జీవితానికి అవసరపడే పనులు చేసి పెడుతుంటాయి చీమలు, కాకులు, తమకు దొరికిన కొద్ది ఆహారాన్ని దాచుకొనకుండా, దోచుకొనకుండా అందరితో కలిసి భుజిస్తాయి. పాడి పశువులు పనికిరాని గడ్డి తిని మనకు స్వచ్ఛమైన తియ్యటి పాలను అందిస్తాయి.ఇంక నదులు త్రాగటానికి మంచి నీటిని ఇస్తాయి. ఇలా సమస్త సృష్టి ఇస్తూనే ఉంటూ, మీరు కూడా ఇవ్వటం నేర్చుకోమని మనకు సందేశాన్ని ఇస్తున్నాయి .అందుకనే ప్రకృతియే ఉత్తమమైన గురువు( Nature is the Best Teacher) అంటారు. మనం ప్రతిరోజు అందరి దగ్గర నుంచి ప్రేమను అందుకుంటున్నాం. మనం పొందుతున్న ఆ ప్రేమను నిస్వార్థంగా ఇతరులతో పంచుకుంటే ఎంత హాయిగా ఉంటుంది. ప్రేమను పంచుకోవటానికి డబ్బే అక్కరలేదు. చిరునవ్వుతో కూడిన పలకరింపు ,ఇతరులలో ఆత్మవిశ్వాసాన్ని నింపి ధైర్యాన్ని పెంపొందించే ఒక మంచి మాట, ఇతరుల లక్ష్యాన్ని అందుకోవటానికి అవసరమైన సలహా ,నిరాశతో దుఃఖంతో ఉన్నవారికి నేనున్నానని చెప్పే భరోసా ఇలా ఎన్నెన్నో... ఇవి అన్ని ఇతరులకు ఇవ్వటం క్రిందికే వస్తాయి..

### ఇవ్వటం ద్వారా పొందే ఆనందం

ఇటీవల విజయవాడలో వరదలు వచ్చినప్పుడు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేసే భక్తులు, ఇంకా అనేక సంస్థల వారు మోకాలి లోతు బురద నీటిలో వరద బాధితుల దగ్గరకు వెళ్ళినప్పుడు ఒక మహిళ "అయ్యా ! నేనెప్పుడూ ఎవరి ముందు చేయి చాచలేదు. కానీ ఈరోజు మీ ముందు రెండు వాటర్ బాటిల్స్ కోసం అర్థిస్తున్నాను. మేము మంచి నీళ్లు త్రాగి రెండు రోజులైంది. మంచినీళ్లు అందిస్తున్న మీరు మాకు దేవతలవలె కనిపిస్తున్నారు" అన్నప్పుడు మీ హృదయంలో నుంచి పొంగిపొర్లుతున్న ఆనందపు అలలను, మెరిసిపోతున్న మీ కళ్ళలో, పెల్లుబుకుతున్న కన్నీటి తెరలను ఎంత డబ్బు ఇచ్చినా కొనగలమా?"నా జీవితంలో పొందిన మధురమైన క్షణం ఇదే అని మీరు అనుకున్నప్పుడు... ఇది కదా ఇచ్చుటలో గల ఆనందం అని మనకు అనిపించక మానదు.. ఎప్పుడు ప్రేమలో స్వార్థం లేదు. ఏది ఆశించరు .అంతేకాదు ఉన్నవారని లేనివారని బేధంలేదు. శంభాల తల్లి ప్రేమ, వాచ్ మాన్ దగ్గర నుండి ప్రధానమంత్రి వరకు సమానంగా ప్రసరిస్తూ ఉంటుంది. ఒకరు శంభాల తల్లి మీ దగ్గర కొచ్చిన వారికి ఎప్పుడూ మీరు ఏదో ఒకటి ఇస్తూనే ఉంటారు దీని గురించి మేము గ్రహించవలసిన సందేశం ఏమిటి?" అన్నప్పుడు శంభాల తల్లి"నేను ఎవరి దగ్గర నుంచి ఏదీ ఆశించను. ఇతరులకు ఇవ్వటంలోనే నాకు ఆనందం ఉంది .మీరు కూడా ఇవ్వటంలో గల ఆనందాన్ని తెలుసుకోవాలని నేను అందరికీ ఇస్తూ ఉంటాను" అన్నారు .ఎంత అద్భుతమైన ఆచరణాత్మక సందేశం! ఇంక ప్రేమలో రెండవ భాగమైన క్షమించటం గురించి తెలుసుకుందాం! మనం ఇతరులలోని దోషాలను చూస్తూ వారిని ద్వేషిస్తున్నంత కాలం వారిలోని మంచిని గ్రహించలేము. అంతేకాదు ఇతరులపై ద్వేషము మన హృదయంలో భారాన్ని పెంచి మనశ్శాంతి లేకుండా చేస్తుంది. మనము ఇతరులు చేసిన పొరపాట్లను మరచిపోయి వారిని క్షమించినప్పుడు అవతలి వ్యక్తికి, మనకు ఇద్దరకు ప్రశాంతత లభిస్తుంది. 'నీకు మనశ్శాంతి లభించాలంటే పరులను విమర్శించటం, ద్వేషించటం మానుకోమని ' శంభాల తల్లి చెబుతారు. క్షమయే సత్యము, క్షమయే ధర్మము, క్షమయే శాంతి అన్ని సద్గుణములు క్షమలోనే ఉన్నాయని పవిత్ర గ్రంథములన్నీ చెబుతున్నాయి.. మనలో ద్వేష గుణము తగ్గుతూ క్షమాగుణము పెరుగుతుంటేనే మనం మంచి వైపు ప్రయాణిస్తున్నట్లని గ్రహించాలి. ఇదే మానవత్వానికి ప్రతీక! మయసభలో ద్రౌపదిని అవమానించినప్పుడు ఆవిడలో ప్రతీకార జ్వాలలు చెలరేగి క్రోధంతో 'దుశ్శాసనుని సంహరించి అతని రక్తాన్ని తన కురులకు రాసుకుంటానని' శపథం చేసింది. కానీ చివరకు తన కుమారులైన ఉపపాండవులను చంపిన అశ్వత్థామను క్షమించి వదిలివేయమని చెబుతుంది. ఇదే మంచి వైపు పరివర్తన కలగటం అంటే! మనలో అటువంటి క్షమాగుణం లేనప్పుడు మనకు కష్టం కలిగించిన వ్యక్తిపై ప్రతీకారం తీర్చుకోవాలని భావం కలుగుతుంది .పగ, ప్రతీకారము మానవులకు ఉండవలసిన లక్షణాలు కావు. అవి మనలో తీవ్రమైన కోపాన్ని కలిగించి, విచక్షణ నశింపజేసి ఇతరులను ఆగ్రహంతో దుర్భాషలాడే స్థాయికి తెస్తాయి అంతేకాదు వారికి మితిమీరిన కష్టం కలిగిస్తాయి. ఇటువంటి చర్య వలన మనకు మిత్రులు కూడా శత్రువులు అవుతారు .ఒక్కసారి కోపం వస్తే మూడు నెలలు తిన్న ఆహారం నీరుగా మారిపోతుందని శంభాల తల్లి చెబుతారు. ఆ కోపం వచ్చే సమయంలో మనసుని నిగ్రహించుకొనటానికి మంచి మార్గం .. ఎదుటి వ్యక్తి తప్పులను మరిచిపోయి క్షమించటమే!

మనం చేసిన పొరపాట్లను దోషములను క్షమించమని భగవంతుని ప్రార్థిస్తాం కదా! I am sorry . please excuse me.. అని మనం ఇతరులను కోరతాం కదా ! అలాగే మన పట్ల పొరపాటు పని చేసిన వాళ్లు కూడా మన దగ్గరనుంచి అదే క్షమాపణ ఆశిస్తారని గ్రహించాలి.. ఎదుటి వ్యక్తి మనకు వ్యతిరేకంగానో, కోపంగానో మాట్లాడినప్పుడు మనం కూడా ప్రతిచర్యగా ( రియాక్షన్) అదే కోపాన్ని ప్రదర్శిస్తే మనం మనశ్శాంతిని కోల్పోతాం! కానీ అదే సమయంలో రియాక్షన్ కాకుండా రెస్పాన్స్ ఇస్తే మన మనస్సులో సమతుల్యత (బ్యాలెన్స్) తప్పకుండా నిగ్రహం కలుగుతుంది. ఆ రెస్పాన్సే చిరునవ్వుతో కూడిన క్షమాగుణం! క్షమ ఇతరులలో పరివర్తన కలిగిస్తుంది.

ఒకసారి బుద్ధుడు భిక్షాటనకు వెళ్ళినప్పుడు ఒక వ్యక్తి పలు రకాలుగా అతనిని దూషిస్తూ ఉన్నాడు . కానీ బుద్ధునిలో ఏమాత్రం స్పందన లేదు. చిరునవ్వుతోనే ఉన్నాడు. చివరకు అతను విసిగిపోయి "నేను ఇన్ని రకాలుగా దూషిస్తూ ఉన్నప్పటికి మీకు బాధగా అనిపించలేదా?" అన్నాడు. అప్పుడు బుద్ధుడు "నీవు ఏదైనా వస్తువును ఇతరులకు ఇచ్చినప్పుడు ఆ వస్తువును అతను స్వీకరించకపోతే ఏమవుతుంది?" అని ప్రశ్నించాడు. అతను "ఆ వస్తువు నాకే చెందుతుంది కదా" అన్నాడు. దానికి బుద్ధుడు "ఇప్పటివరకు నీవు దూషించినవి ఏదీ కూడా నేను తీసుకొనలేదు" అన్నాడు. ఆ మాటతో ఆ వ్యక్తిలో పరివర్తన వచ్చింది .ఆ దూషణలన్నీ తనకే చెందినవని గ్రహించి బుద్ధుని పాదములపై పడి తనను క్షమించమని ఇంకెప్పుడూ పరులను దూషించనని పశ్చాత్తాపం చెందాడు. ఈ విషయంలో అతని మాటలకు బుద్ధుడు రియాక్షన్ ఇవ్వలేదు. రెస్పాన్స్ ఇచ్చాడు. ఈ విధంగా బుద్ధుడు చూపించిన సహనము, క్షమ ఆ వ్యక్తిలో పరివర్తన తెప్పించింది. "ఎవరైనా నీ తప్పులను తెలియజేస్తే అతనితో వాదించక అతనిపై ద్వేషం పెట్టుకొనక నిజంగా ఆ తప్పులు నీలో ఉన్నాయా అని నిన్ను నువ్వు పరిశీలించుకో. ఏదైనా తప్పు ఉంటే ఆ తప్పు తెలిపిన వారికి కృతజ్ఞతలు తెలిపి నీ తప్పును సవరించుకో.. అటువంటి ఆలోచన మనలోని దోషములను తొలగించుకొనటానికి వీలవుతుంది. అంతే కాదు మన మనస్సులో క్రోధమును తగ్గించి శాంతిని కలిగిస్తుంది" కోపము, పగ అనేవి విషం లాంటివి. మనం కోపగించుకోవటం అంటే మనం విషం తాగి ఇతరులు చనిపోవాలని కోరుకోవడమే. అది మనలనే హతమారుస్తుంది. కానీ క్షమ అనేది అమృతం లాంటిది. అది క్షమించిన వారికి, విమర్శించిన వారికి ఇద్దరికీ మేలు చేసి మనశ్శాంతినిస్తుంది. అలాగే కోపం అనేది నిప్పులాంటిదని పెద్దలు చెప్పేవారు. అది ఎంతకాలమైనా మనలోనే ఉండి మన హృదయాన్ని దహించి వేస్తుంది. కానీ క్షమ చల్లని వెన్నెల లాంటిది. అది మన హృదయాన్ని చల్లబరుస్తుంది. కనుక పరులను క్షమించటం మన ప్రయోజనం కోసమే!

క్షమాగుణానికి హద్దు లేదు. ద్వేషించటం అనేది శంభాల తల్లి చరిత్రలో లేనేలేదు. నేను మీరు ఎప్పుడో చేసిన మంచిని మాత్రమే గుర్తుంచుకుంటాను కానీ మీరు చేసిన చెడ్డ పనిని నేను గుర్తుంచుకొనను "అంటారు శంభాల తల్లి" ఇదే కదా నిజమైన ప్రేమ అంటే! నా విషయంలో కూడా నన్ను విమర్శించిన వారిని ద్వేషిస్తూ ఉన్నంతకాలం నాకు నిద్ర పట్టకుండా వారు చేసిన చెడ్డ పనిని గుర్తు చేసుకుంటూ ఉండేవాడిని. కానీ ఎప్పుడైతే వారు చేసిన హానిని మరిచిపోయి క్షమించటం మొదలుపెట్టానో ,నా మనసు ప్రశాంతంగా హాయిగా ఉండేది. అంటే మనం ఇతరులను క్షమించటం వారి కోసం కాదు. మన సంతోషం మన ప్రశాంతత కోసమే అనేది అర్థం అయింది. ముగింపు ఇతరులు సమస్యలలో ఉన్నప్పుడు వారి అవసరాల కోసం మన దగ్గర ఉన్న వాటిని వారితో పంచుకుంటూ వారిని ఆనంద పరచడం,( Giving) ఇతరులు మన పట్ల చేసిన పొరపాట్లను క్షమించి వారిపై ద్వేష భావాన్ని లేకుండా చేసుకొనటం( Forgiving) ఉత్తమమైన మానవుని లక్షణాలు. అది మనకు, సమాజానికి ఎంతో మేలు చేస్తుంది. అటువంటి ఉన్నత విలువలను ఆచరణలో ఉంచుతూ నిజమైన దేవతా మూర్తులుగా మిగిలిపోదాం!!

## ఇంధన రంగంలో సైబర్ రక్షణ..

ఉండాలని అభిప్రాయపడ్డారు. శనివారం సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా ఇంధన భద్రత, విద్యుత్ రంగంలో అధునాతన టెక్నాలజీ వినియోగం కోసం రాష్ట్ర ప్రభుత్వం వరల్డ్ ఎకనమిక్ ఫోరంతో ఒప్పందం కుదుర్చుకుంది. సెంటర్ ఫర్ ఎనర్జీ, సైబర్ రెజిలియన్స్ సెంటర్ ఏర్పాటుపై WEFతో ప్రభుత్వం ఎంఓయూ చేసుకుంది. సీఎం చంద్రబాబు సమక్షంలో ఈ ఒప్పందం చేసుకుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ...'ఇంధన రంగంలో అవసరమైన సైబర్ రక్షణ వ్యవస్థలను కూడా తయారు చేసుకోవాలి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు WEF ముందుకు రావడం సంతోషం. ప్రపంచం అంతా గ్రీన్ ఎనర్జీ వినియోగం గురించే ఆలోచన చేస్తోంది. 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీని ఏపీలో ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అతితక్కువ వ్యయంతో విద్యుత్ ఉత్పత్తి చేసి సరఫరా చేయాలనేది ప్రభుత్వ ఆలోచన. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ సంస్కరణలు చేసి వినియోగాన్ని పెంచగలిగాం. ఏఐ లాంటి టెక్నాలజీ వినియోగం ద్వారా విద్యుత్ పంపిణీ నష్టాలు, సరఫరా వ్యయం తగ్గించాలి. అప్పుడే ఇంధన రంగంలో సుస్థిరత సాధ్యం అవుతుంది. వ్యవసాయం, వాణిజ్యం, పరిశ్రమలు, గృహాలు ఇలా అన్నిటికీ ఇలా ప్రతి రంగానికీ విద్యుత్ అవసరమే. ఈ మేరకు విద్యుత్ డిమాండ్ ను తట్టుకునేందుకు... మరింత విద్యుత్ ఉత్పత్తి చేయడం ద్వారా ప్రజలకు లాభాలు కల్గించేలా...మరింత మేలు జరిగేలా...ఎక్కడికక్కడే విద్యుత్ ఉత్పత్తి చేసుకునేలా విధానాలను కూడా తయారు చేసుకుంటున్నాం. ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన కింద ఏపీలో సోలార్ రూఫ్ టాప్ ప్రాజెక్టును వేగంగా చేపట్టాం."అని ముఖ్యమంత్రి వివరించారు.

## రేవంత్ సైలెంట్ వార్నింగ్

సీనియర్లున్నా, పార్టీని తొలి నుంచి అంటిపెట్టుకున్న వారు పార్టీలో ఉన్నావారందరినీ పక్కన పెట్టి రేవంత్ రెడ్డికి ముఖ్యమంత్రి పదవి ఇచ్చిన కాంగ్రెస్ నాయకత్వం ఆయన పనితీరును పరిశీలించిన తర్వాతనే నిర్ణయం తీసుకుంది. అయితే రేవంత్ రెడ్డి రాహుల్ దూరం పెడుతున్నారని కూడా ప్రత్యర్థులు చేస్తున్న ప్రచారానికి ఈ ఎన్నిక ఫలితంతో చెక్ పెట్టినట్లయింది. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువ. ముఖ్యమంత్రిని కూడా కేర్ చేయని ఎమ్మెల్యేలుంటారు. అలాంటి వారందరి నోళ్లు ఈ ఎన్నిక ఫలితం మూత పడేలా చేస్తుందనడలో ఎలాంటి సందేహం లేదు. ముఖ్యమంత్రి పదవి కొట్లాడి తెచ్చుకున్నది కాదని, కష్టపడి తెచ్చుకున్నదని రేవంత్ రెడ్డి ఈ ఎన్నికల్లో నిరూపించుకున్నారు. అందుకే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఏ ముఖ్యమంత్రి ప్రచారం చేయని విధంగా కార్నర్ మీటింగ్ లు, రోడ్ షోలు చేసి ప్రజలను మెప్పించి, ఒప్పించి సీటును దక్కించుకోగలిగారు. దీంతో రేవంత్ రెడ్డి నాయకత్వానికి కాంగ్రెస్ పార్టీలో ఇక చెక్కు చెదరని విధంగా ఉందన్నది మరోసారి అర్థమయింది. ఆయన ప్రత్యర్థులకు రేవంత్ ఈ రకంగా జవాబు చెప్పినట్లయింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గెలుపుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.

## కాంగ్రెస్ పార్టీ రౌడీయిజం

కార్యకర్తను కంటికిరెప్పలా కాపాడుకుంటామని చెప్పారు. ఆపదొస్తే అన్ని వేళల్లో అండగా ఉంటాని తెలిపారు. తమ కార్యకర్తపై జరిగిన దాడికి కాంగ్రెస్ బాధ్యత తీసుకోవాలన్నారు.దొంగ ఓట్లు, గూండా గిరి చేసి, డబ్బులు పంచి జూబ్లీహిల్ స్‌లో కాంగ్రెస్ పార్టీ గెలిచిందని చెప్పారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో తమకు గతంలో 80 వేలు ఓట్లు వస్తే ఈ ఉప ఎన్నికలో 75 వేల ఓట్లు వచ్చాయని, ఇన్ని కుట్రలు, రిగ్గింగ్ చేసినా మా ఓట్లు కేవలం 5 వేలు మాత్రమే తగ్గాయన్నారు. కచ్చితంగా భవిష్యత్తులో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగరవేసి తీరుతామని స్పష్టం చేశారు.తాను అహంకారం తగ్గించుకోవాలన్న రేవంత్ వ్యాఖ్యలపై స్పందిస్తూ.. శుక్రవారం రాత్రి కాంగ్రెస్ పార్టీ చేసిన విజయోత్సవ ఊరేగింపుతోనే ఎవరిది అహంకారమో తేలిపోయిందని కేటీఆర్ అన్నారు. గతంలో మేము అనేక ఉప ఎన్నికలు గెలిచాము, కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్లు కూడా రాలేదు. అందుకని ఆ పార్టీ గుర్తును గాడిద మీద వేసి ఊరేగించామా అని ప్రశ్నించారు. ఒక్క ఉప ఎన్నిక గెలిచినందుకే ఇంత ఎగిరి పడడం అవసరం లేదని చురకలంటించారు. ఎవరిది అహంకారమో ప్రజలు నిర్ణయిస్తారన్నారు. జూబ్లీహిల్స్ నేతలు, కార్యకర్తలతో మంగళవారం సమావేశం నిర్వహించానున్నామని చెప్పారు. కాంగ్రెస్ గుండాయిజం మానుకోకపోతే ప్రజలే బుద్ధి చెబుతారన్నారు.

# పీర్జాదిగూడ ప్రగతికి నమూనా..!


- పరిశోధన విద్యార్థులతో జరిగిన ముఖాముఖిలో మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి



**జయభేరి, మేడిపల్లి :**

తెలంగాణ రాష్ట్రంలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ ప్రగతికి నమూనా అని మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి అన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం భౌగోళిక శాస్త్ర విభాగం, ఐసీఎస్ఎస్ఆర్ సౌజన్యంతో దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన సుమారు 30 మంది (దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన) పరిశోధన విద్యార్థులు, వివిధ యూనివర్సిటీల అధ్యాపకులు, ఉద్యోగులు శనివారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో జరిగిన అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం పరిశోధన విద్యార్థులతో జరిగిన "స్టూడెంట్స్ విత్ మేయర్" ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి కార్పొరేషన్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను సమగ్రంగా వివరించారు. ముఖ్యంగా పార్కులు, తడి, పొడి చెత్త సేకరణ, ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ పార్కు, వైకుంటధామం, కోవిడ్ సెంటర్ నిర్వహణ, వార్డు ఆఫీసర్స్ వ్యవస్థ, సెట్విన్ బ్రాంచ్ ఏర్పాటు, విద్యావాలంటీర్ల నియామకంతో పాటు ప్రజల భాగస్వామ్యం తో చేపట్టిన అనేక అభివృద్ధి పనులు, వాటి వలన ప్రజలకు కలుగుతున్న మేలును మాజీ మేయర్ దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన పరిశోధన విద్యార్థులకు వివరించడంతో పాటు విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు మాజీ మేయర్ సమాధానాలు చెప్పారు. ప్రజలకు సేవ చేయాలనే తమ సంకల్పం ఉంటే ప్రభుత్వ సహకారంతో అనేక అభివృద్ధి పనులు చేయొచ్చన్నారు.

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, పురపాలక శాఖ మాజీ మంత్రి కేటీఆర్ రాష్ట్రంలోని స్థానిక సంస్థలకు ప్రత్యేక నిధులు ఇచ్చి అభివృద్ధి పనులను ప్రోత్సహించడం జరిగిందన్నారు. ఈ క్రమంలోనే పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో అనేక అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి వైకుంఠదామంను వీక్షించి, అందులో ప్రజలకు అందిస్తున్న సౌకర్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పరిశోధన విద్యార్థుల ఫీల్డ్ విజిట్, ట్రైనింగ్ కోఆర్డినేటర్ ఉషా, డా. సుదర్శన్, వివిధ రాష్ట్రాలకు/విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.



## స్వర్గీయ డా.అందెశ్రీ అనుభవంతో రాసిన ఈ కవిత

బాపు... నీకు సావు ఎక్కడిదే....
బాపు నీకు సావు ఎక్కడిదే
యాడ సూసిన నువ్వే...
బాపు యాడ చూసిన నువ్వే...
నువ్వు లేవు... నువ్వు రావు...
అన్న క్షణం నుంచి నీకోసం ఎన్నో కన్నులు వెతికిన క్షణం ఎలా మర్చిపోతాను..

అందెశ్రీగా అవధులు దాటిన...
నీ సాహిత్యాన్ని ప్రతోడు పాడుతూ ఉంటే...
నీవు లేవన్న నిజం నేను నమ్మలేక పోతున్నాను..

చేతిలో చరవాణి పట్టుకొని చూస్తే..
ఎక్కడ చూసినా నువ్వు పాడిన పాటలే.. నువ్వు రాసిన పాటలే ..
నీ రూపం చూస్తూనే.... కాలాన్ని మొత్తం కరిగించేస్తున్న..

నిన్ను కొందరు ధిక్కారస్వరం అంటారు...!? ఇంకొందరు
చాలా మంచోడు అంటారు.. !
ఏ హే.. ఎవ్వరేమనుకున్న నువ్వు మాత్రం గట్టిగా ప్రశ్నించేటోడివే...
ఉన్నది ఉన్నట్టు కుండ బద్దలు కొట్టేటోడివే...

మలి దశ తెలంగాణ ఉద్యమ పోరులో
"జై బోలో తెలంగాణ" అని గట్టిగా ఊపిరి తీసుకొని పాడిన
ఆ పాటలు మల్ల మల్ల చూస్తున్నారు జనాలు.. అసలే మర్చిపోతలే...
బాపు అని పిలిచిన నేను... గప్పు డొక మాటంటివి...

"ఏమిరా కడారి..." ఉద్యమం చివరి వరకు ఉంటావా..!?
అన్న నీ మాట నాకు ఇంకా చెవుల గిర్రు మని ఇంకా మోగుతూనే ఉంది...
బాపు నీవు లే వన్నోళ్ళ మాటలు నేను నమ్మను...
ఎందుకంటే తెలంగాణ రాష్ట్ర గీతమై
"జయ జయహే" అని పాడుతూ... నీకు
జోహార్ నేను ఎట్లా చెప్తనే..

ఎప్పటికీ నువ్వు బతికే ఉంటవు...
నీ పాటలు ఈ జనం
నోళ్ళల్లో మోగుతున్నప్పటి వరకు....
ఎందుకంటే నాకు చావు వస్తే నాకు తెలుసు అంటివి కదా... నీకు సావు ఎక్కడిదే.... మళ్లీ నువ్వు పుడతావని అనుకుంటున్నా....
ఎందుకంటే నేనున్నా నీకోసం....
నీ యాదిలో కడారి..



**కడారి శ్రీనివాస్**
జయభేరి సీనియర్ జర్నలిస్ట్,
98489 62799
కవి రచయిత, గాయకుడు,
తెలంగాణ ఉద్యమకారుడు,
గిడుగు రామ్మూర్తి అవార్డు గ్రహీత

# బోడుప్పల్ సుద్దకుంట చెరువును పరిశీలించిన హైడ్రా కమిషనర్

**జయభేరి, మేడిపల్లి :**



మేడ్చల్ జిల్లా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ లోని సుద్దకుంట చెరువును హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. సుద్ద కుంట పరివాహక ప్రాంతంలో నివాసితుల ఇండ్లకు ఇరిగేషన్ అధికారులు ఎఫ్.టి.ఎల్ మార్క్ పెట్టారు. బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుద్దకుంట చెరువును హెచ్ఎండిఏ ద్వారా సుందరికరణ చేయుటకు ఎఫ్.టి.ఎల్ పరిధి గురించి ఇరిగేషన్ అధికారులను అడగటంతో ఇరిగేషన్ అధికారులు ఎఫ్.టి.ఎల్ హద్దులు పెట్టారు. గత ముప్పై సంవత్సరాలకు పైగా ఉన్న ఇండ్లకు ఎఫ్.టి.ఎల్ అనడంతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ ను సుద్దకుంట పరిసర ప్రాంత నివాసితులు ఆశ్రయించారు. హైడ్రా పేరుతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని రంగనాథ్ కి స్థానిక బాధిత ప్రజలు విన్నవించుకున్నారు. స్థానికుల పిర్యాదుతో సుద్దకుంటను హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించి, స్థానికులకు భరోసా ఇచ్చారు. ఏండ్ల తరబడి ఉన్న ఇండ్లకు ఎఫ్.టిఎల్ నిర్ణయించి స్థానికులకు భయాందోళనకు గురిచేయడం సరికాదు అని రంగనాథ్ అన్నారు. బోడుప్పల్ మున్సిపల్ కమిషనర్, ఇరిగేషన్ అధికారులను సంపూర్ణ విషయం అడిగితెలుసున్నారు. సుద్ద కుంట ఆరు ఎకరాలు కాదు, ఉన్న మూడు ఎకరాల సుద్ధకుంటను అభివృద్ధి చేయాలని కమిషనర్ కి సూచించారు. స్థానిక ప్రజలు ఎవరు భయపడాల్సిన అవసరం లేరు. హైడ్రా పేరుతో భయభ్రాంతులకు గురిచేసి డబ్బులు తీసుకునే వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. మీ ఇండ్లకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు అని రంగనాథ్ తెలియచేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.


# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

- 216మందికి సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు, 113మందికి ఇందిరమ్మ ఇళ్ల ప్రొండింగ్స్ కాఫీ భాధితులకు అందజేసిన ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యులు బీర్ల అయిలయ్య

**జయభేరి, యాదగిరిగుట్ట:**



ఇళ్లు లేని పేదలు ఉండొద్దనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని తీసుకొచ్చిందని,ఆలేరు నియోజకవర్గంలోని అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు కట్టించిస్తామని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు. శనివారం యాదగిరిగుట్ట పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు, ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ లను బీర్ల అయిలయ్య పంపిణీ చేశారు. ఆలేరు నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన 216 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు, 113 మందికి ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ లను బీర్ల అయిలయ్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ రాష్ట్రంలోని సంక్షేమాభివృద్ధి కొనసాగుతుందని, అందుకు నిదర్శనమే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రజల తీర్పు అని అన్నారు. ఆలేరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తామని తెలిపారు. సీఎం రిలీఫ్ ఫండ్ దరఖాస్తు చేసుకున్న మిగతా వారికి కూడా త్వరలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తామని తెలిపారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని మాదిరిగానే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఫలితాలు పునరావృతం కావాలని, ప్రజలందరూ కాంగ్రెస్ ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ ఐన్యాల చైతన్యరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మంగసత్యనారాయణ, కాంద్రోజు వెంకట్ రాజు, నమిలే హేందర్ గౌడ్,శంకర్ నాయక్,కాంగ్రెస్ నేతలు చీర శ్రీశైలం, గుండ్లపల్లి భరత్ గౌడ్,ముఖ్యర్ల మల్లేష్, దుంబాల వెంకట్ రెడ్డి,శిఖ ఉపేందర్ గౌడ్, కళ్లెం జహీంగీర్, యాకుబ్, బందారపు భిక్షపతి,ఎరుకల హేమేందర్, గంధమల్ల అశోక్, దూసరి మురళి, తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా లక్ష పుష్పార్చన

**జయభేరి, యాదగిరిగుట్ట:**



యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రధానాలయంలో ఆలయ అర్చకులు ఘనంగా లక్ష పుష్పార్చనను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్లకు ఉదయం పంచామృతాలతో వేద మంత్రాలతో ఆలయ అర్చకులు ఘనంగా అభిషేకం నిర్వహించారు. పట్టు వస్త్రాలను ధరింపజేశారు. బంగారు, వజ్ర వైఢూర్యాలతో దివ్య మనోహరంగా వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకారం చేశారు. గులాబీ, మందారం, మల్లె, చామంతి, చంపక, మల్లికా, వంటి అనేక రకాలైన పుష్పాలతో స్వామి అమ్మవార్లకు వేద మంత్రాలు మంగళవాయిద్యాల నడుమ సహస్రనామాన్ని పఠించారు. సహస్రనామార్చన చేస్తూ లక్ష పుష్పార్చన చేశారు. అలాగే ఉదయం సుదర్శన హోమం నిర్వహించారు. ఇందులో ఆంజనేయం, నరసింహం,వంటి దేవతల మూల మంత్రాలతో హవనం చేసారు. అలాగే నిత్య కళ్యాణం ఘనంగా నిర్వహించారు. సాయంకాలం వెండి జోడు సేవ నిత్యకల్యాణం వంటి సేవలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సురేంద్రాచార్యులు, ముఖ్య అర్చకులు వెంకటాచార్యులు, ఆలయ అర్చకులు అనిల్ కుమారాచార్యులు, సూపరింటెండెంట్ సీతారామ చారి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.




# యూనియన్ ఎన్నికల్లో బాణం గుర్తు విడుదల

**జయభేరి, ఉప్పల్ :**

ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఎంప్లాయిస్ & వర్కర్స్ యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో బాణం గుర్తును కార్యకర్తలు, స్థానిక శాసనసభ్యులు బండారు లక్ష్మారెడ్డి చేతుల మీదుగా విడుదల చేయడం అయింది వారి నివాసంలో BRTU రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ESCI బోర్డు డైరెక్టర్ మారయ్య ఆధ్వర్యంలో కలవడం జరిగింది. 17 నవంబర్ 2025 సోమవారం రోజున ఉదయం 10 : 00 గంటలకు గేట్ మీటింగ్ కు హాజరు కావలసిందిగా కోరడం జరిగింది. దానికి వారు సానుకూలంగా స్పందించి తప్పకుండా హాజరవుతానని హామీ ఇవ్వడం జరిగింది. శాసనసభ్యులు బండారు లక్ష్మారెడ్డి చేతుల మీదుగా మేనిఫెస్టో, బ్యాలెట్ పేపర్ను ఆవిష్కరించడం జరిగింది. శాసనసభ్యులు కార్మికులందరినీ ఉద్దేశించి ఢిల్లీ పబ్లిక్ స్కూల్ గుర్తింపు ఎన్నికలలో BRTU అనుబంధం అయినటువంటి ఢిల్లీ పబ్లిక్ స్కూల్, ఎంప్లాయిస్ & వర్కర్స్ యూనియన్ ను, కార్మికులందరూ బాణం గుర్తుకు ఓటు వేసి BRTU ను గెలిపించగలరు. కార్మికులందరూ ఒక్కటై విజయం సాధించి మీ హక్కుల కోసం పోరాడాల్సిందిగా వారు కోరడం జరిగింది. మీకు భవిష్యత్తులో ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా తప్పక నా నుంచి అండదండలు ఉంటాయి అని వారు హామీ తెలియజేయడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రెటరీ N మధు గౌడ్, P నాగేష్ గౌడ్, M నాగరాజు, T చైతన్ సింగ్, CH మల్లేష్, CH జనార్ధన్, N శివకుమార్, P సైదులు, SK రఫిక్, B కుమార్, K శ్రీకాంత్, G వెంకటేష్, మహిళా కార్యకర్తలు P రజిత, G స్వర్ణలత, T నాగమణి, L మంగమ్మ, K నర్మద, K జయమ్మ, CH శ్రీలత, D ఉమా, యశోద, రాణి తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ పార్టీ మండల కౌన్సిల్ సమావేశం

- ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తున్న భూ కబ్జాదారులపై శాఖా పరమైన చర్యలు తీసుకోండి : ఉమా మహేష్ సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి




**జయభేరి, మేడిపల్లి :**

మేడిపల్లి మండలం సిపిఐ పార్టీ మండల కౌన్సిల్ సమావేశం సిపిఐ పార్టీ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినది. దండు రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జి దామోదర్ రెడ్డి హాజరైనారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఉమా మహేష్ & జి దామోదర్ రెడ్డి లు మాట్లాడుతూ సిపిఐ పార్టీ 100 సంవత్సరాల వారోత్సవాల సందర్భంగా డిసెంబర్ 26న, ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని మరియు నవంబర్ 20 నాడు సిపిఐ పార్టీ ప్రచార జాత మేడిపల్లి చౌరస్తాలో సాయంత్రం 4,గం మీటింగ్ కు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని మేడిపల్లి మండలంలో ప్రభుత్వ స్థలాలను కబ్జాలు చేస్తున్న కబ్జాదారులపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని అధికారులు తీసుకోవాలని అన్నారు. జంట కార్పొరేషన్ లో ఎక్కడ చూసిన పుట్టగొడుగుల్లా అక్రమ నిర్మాణాల్లో దర్శనమిస్తున్నాయని వీటిని కార్పొరేషన్ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు. జిల్లా మహిళా సమాఖ్య కార్యదర్శి జే లక్ష్మి, మేడిపల్లి మండల కౌన్సిల్ సభ్యులు సిహెచ్ మాధవి, నాగరాజు, కె ప్రమీల, కె.మహాలక్ష్మి, రమాతార, అనిత,ఎండి అన్వర్, భూతం ఐలయ్య, కొమురయ్య, బాపురాజు, డి.మధార్, రచ్చ శ్యామ్, కనకయ్య, బి నరేష్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పీర్జాదిగూడ హై స్కూల్‌లో పర్యవేక్షణ

- బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు గోగుల సరితతో కలిసి సందర్శించిన తుంగతుర్తి రవి



**జయభేరి, మేడిపల్లి :**

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీర్జాదిగూడ హై స్కూల్‌ను తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు గోగుల సరితతో కలిసి పర్యవేక్షించడం జరిగింది. ఈ సందర్భంగా స్కూల్‌లోని మౌలిక సదుపాయాలు, తరగతి గదుల శుభ్రత, తాగునీటి సదుపాయం వంటి అంశాలను పరిశీలించారు. అలాగే విద్యార్థులకు అందించబడుతున్న మధ్యాహ్న భోజనం నాణ్యత, పరిశుభ్రత, మెనూ అమలు, వంటశాల పరిస్థితులపై సమగ్రంగా విచారణ చేసి సంబంధిత సిబ్బందితో మాట్లాడారు.పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలు, అవసరాలు, విద్యాభ్యాసానికి సంబంధించిన అంశాలు గురించి విద్యార్థుల నుండి నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి అవసరమైన సూచనలు అందించారు. స్కూల్‌లో అందుబాటులో ఉన్న సౌకర్యాలను మెరుగుపరచడం, పిల్లలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడం పట్ల ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచనలు చేసిన కమిషన్ సభ్యురాలు సరిత. ఈ కార్యక్రమంలో MEO శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు అంజమ్మ, స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**జయభేరి, తుర్కపల్లి, నవంబర్ 15:**

తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామానికి చెందిన పోతరాజు లింగయ్య అనారోగ్యంతో మరణించడంతో ఆయన కుటుంబానికి మాజీ సర్పంచ్ పోగుల ఆంజనేయులు 5 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని శనివారం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశం, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలకు ల్యాబ్ రసాయనాలను అందజేయడం అభినందనీయ




**జయభేరి, తుర్కపల్లి, నవంబర్ 15 :**

యాదాద్రి భువనగిరి జిల్లాలోని 105 ప్రభుత్వ పాఠశాలలకు సాధారణ ల్యాబ్ 40 రకాల రసాయనాలను జే ఐ టీచ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ వారు అందజేయడం అభినందనీయమని డీఈవో సత్యనారాయణ అన్నారు. శనివారం తుర్కపల్లి మండలం రాంపూర్ తండాలోని మోడల్ స్కూల్లో జిల్లాలోని 105 ప్రభుత్వ పాఠశాలలకు సాధారణ ల్యాబ్ 40 రకాల రసాయనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడల్ స్కూల్ లో అధ్యాపకునిగా పనిచేయుచున్న కోట నవీన్ కుమార్ స్నేహితుడు జే ఐ టీచ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో డాక్టర్ శివప్రసాద్ కస్తూరి తో కలిసి గత రెండు సంవత్సరాల్లో ప్రభుత్వ పాఠశాలలను సందర్శించినప్పుడు అనేక పాఠశాలల్లో ప్రాథమిక కెమిస్ట్రీ ల్యాబ్ రసాయనాలు లేని సమస్యను గుర్తించి దీంతో విద్యార్థులు ప్రయోగకంగా నేర్చుకునే అవకాశం కోల్పోతున్నారని, గ్రహించి పాఠశాలలకు ల్యాబ్ రసాయనాలను అందజేయడం జరిగిందని అన్నారు. ఇది విద్యార్థుల్లో శాస్త్రీయ ఆసక్తిని పెంచి ప్రయోగాత్మక అభ్యాసానికి దోహదం చేస్తుందని అన్నారు. నేర్చుకొని సంపాదించి సమాజానికి సేవ చేయాలి. అన్న తన తత్వంతో డాక్టర్ శివప్రసాద్ కస్తూరి విద్య సామాజిక అభివృద్ధికి ఎల్లప్పుడు అండగా ఉంటున్నారని అన్నారు. ఎల్లప్పుడు విద్యాభివృద్ధికి ప్రోత్సహిస్తూ లెర్న్ ఎర్న్ సర్వీస్ అనే నినాదాన్ని అనుసరిస్తున్నారని నేర్చుకోండి ఆజ్ఞానంతో సంపాదించండి చివరికి సమాజానికి సేవ చేయండి అనే నినాదంతో ముందుకెళ్తున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో రసాయనాల పంపిణీకి సహకారం అందించిన కోట నవీన్ కుమార్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అంబటి శోభారాణి, ఉపాధ్యాయులు వినోద రాణి , కార్తీక్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చంద్ర పుల్లారెడ్డి వర్ధంతిని జయప్రదం చేయండి



**జయభేరి, గార్ల, నవంబర్ 15:**

భారత విప్లవోద్యమ నిర్మాత,ప్రతిఘటన పోరాట రూపశిల్పి చంద్ర పుల్లారెడ్డి 41వ వర్ధంతి సభకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ మహబూబాబాద్ డివిజన్ కార్యదర్శి నందగిరి వెంకటేశ్వర్లు,జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జడ సత్యనారాయణ పిలుపునిచ్చారు.చంద్ర పుల్లారెడ్డి రచనల పుస్తక ఆవిష్కరణ సభ సుందరయ్య విజ్ఞాన కేంద్రం బాగ్ లింగంపల్లి హైదరాబాదులో జరిగే సభను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం మండల కేంద్రంలోని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో గోడపత్రాలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భారత కమ్యూనిస్టు విప్లవకారుల అగ్ర నాయకులలో చంద్ర పుల్లారెడ్డి ప్రముఖులని,సిపిగా విప్లవోద్యమంలో చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. పుస్తక ఆవిష్కరణ కార్యక్రమానికి ప్రజలు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ గార్ల మండల కార్యదర్శి జి.సక్రు, మాన్య, గౌని మల్లేష్, మనోహర్, జడ ఐలమ్మ, ఇర్రి రవి తదితరులు పాల్గొన్నారు.

## నూతన గృహ ప్రవేశానికి హాజరైన సోదా రామకృష్ణ



**జయభేరి, పరకాల, నవంబర్ 15:**

పరకాల మున్సిపల్ పరిధిలోని 20 వార్డుకు చెందిన మాజీ వార్డు మెంబర్ బొచ్చు శ్రీనివాస్కళావతి (డీలర్)ల నూతన గృహప్రవేశ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు సోదా రామకృష్ణ. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ 20వ వార్డు అధ్యక్షులు బొచ్చు సాల్మన్, నాయకులు మునిగంటి విష్ణువర్ధన్, ఏకు బొబ్బిలి తదితరులు పాల్గొన్నారు.

# సహకార సంఘాలను బలోపేతం చేయాలి

- ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి
- సహకార సంఘాలు బలంగా ఉంటేనే రైతులు ఆనందంగా ఉంటారు
- సహకార వ్యవస్థ తోనే అభివృద్ధి సాధ్యం
- పిఏసిఎస్ నూతన కార్యాలయ భవనం ప్రారంభం



**జయభేరి, పరకాల, నవంబర్ 15:**

పరకాల నియోజకవర్గం లోని ఆత్మకూరు మండలం పెంచికలపేట పిఎసిఎస్ ఆధ్వర్యంలో నీరుకుల్ల గ్రామంలోని కందిబండ వద్ద ధాన్యం సేకరణ డ్రై షెడ్ కు భూమి పూజ, ఫర్టిలైజర్ గోదాం డ్రై షెడ్ కార్యాలయమునకు భూమి పూజ చేశారు. అలాగే పిఎసిఎస్ చైర్మన్ కంది శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పెంచికలపేట గ్రామంలో 72వ అఖిలభారత సహకార వారోత్సవాల సందర్భంగా పిఎసిఎస్ పెంచికల పేట నూతన భవనం ప్రారంభోత్సవం (నీరుకుళ్ళలో) టీక్యాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావుతో కలిసి రేవూరి ప్రకాశ్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన 72వ అఖిల భారత సహకార వారోత్సవాల సందర్భంగా జెండాను ఆవిష్కరించి, ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మనకు మనం అభివృద్ధి చేసుకునే వ్యవస్థ సహకార వ్యవస్థ అని, వ్యవసాయ రంగానికి సహకార వ్యవస్థ చాలా అవసరం అన్నారు. దేశ ఆర్థిక పరిస్థితి వ్యవసాయంపై ఆధారపడి ఉందని, సహకార వ్యవస్థ ద్వారానే అభివృద్ధి సాధ్యం అని అన్నారు. రైతులకు ఎరువులు, విత్తనాలు, బ్యాంకింగ్, తదితర సేవలు అందిస్తున్నారన్నారు. ఇదే స్ఫూర్తిగా తీసుకొని డ్వాక్రా గ్రూపులను చేయించి ప్రోత్సహించి, మహిళా బ్యాంకులు, మహిళా సాధికార లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తున్నదని అన్నారు. మహిళల ఆర్థిక వ్యవస్థ పరకాల మహిళా డైరీ ఏర్పాటుకు కృషి చేస్తుందని, రైతు కుటుంబాలు గౌరవంగా ఉండాలంటే, సహకార సంఘాలు బలోపేతం కావలసి ఉందన్నారు. ఆధునిక వ్యవసాయ యంత్రాలను అందించడం, రైతులకు సాగు విధానం, ఆధునిక వ్యవసాయం, తదితరా అంశాలకు సహకార సంఘాలు తోడ్పడతాయన్నారు. రైతులు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను అందిపుచ్చుకోవాలని, సకాలంలో పెంచికలపేట పిఎసిఎస్ భవనాన్ని పూర్తిచేసి, రైతులకు ఉపయోగపడేలా కృషి చేసినందుకు పాలకవర్గాన్ని అభినందించారు. అభివృద్ధిలో రాజకీయాలు వద్దు అని, పనిచేసే వారికి రాజకీయాలకతీతంగా ప్రోత్సహిస్తాను అన్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు కలిసి పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. చేస్తున్న ప్రతి పనికి అధికారుల సహకారం ఉండడం వలనే ముందుకు పోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఓ సంజీవరెడ్డి, నాబార్డ్ డిడిఎం చంద్రశేఖర్, డీసీసీబీ సీఈవో వజీర్ సుల్తాన్, తదితరులు పాల్గొన్నారు.



# రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలి

**జయభేరి, గార్ల, నవంబర్ 15:**



రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకొని మేలైన యాజమాన్య పద్ధతులు అవలంబించడం ద్వారా అధిక దిగుబడులు సాధ్యమని మహబూబాబాద్ జిల్లా వ్యవసాయ అధికారి విజయ నిర్మల అన్నారు.మండల పరిధిలోని బుద్ధారం గ్రామంలో వ్యవసాయ శాఖ ద్వారా సరఫరా చేసిన వరంగల్ 44 (సిద్ధి)రకం వరి పంటను శనివారం క్షేత్రస్థాయి సందర్శన చేపట్టారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రైతులు విత్తనాభివృద్ధి పై అవగాహన పెంచుకోవాలని ప్రభుత్వం ద్వారా సరఫరా చేసిన నాణ్యమైన విత్తనాలను తిరిగి రైతులందరూ వినియోగించుకోవాలని అప్పుడు మాత్రమే రైతులకు మేలైన విత్తనాలు లభిస్తాయని తెలిపారు.రైతు నుండి రైతుకు విత్తనాలు అందించడమే నాణ్యమైన విత్తనాల ముఖ్య ఉద్దేశం అని అన్నారు. రైతులందరూ ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విత్తనాల ఎంపికలో రైతులు జాగ్రత్తలు పాటించాలని, గ్రామాలలో తిరుగుతూ విత్తనాలు అంటగట్టే అపరిచేత వ్యక్తుల వద్ద ఎట్టి పరిస్థితుల్లో విత్తనాలు కొనుగోలు చేయవద్దని తెలిపారు. అధికృత లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేసి పంట కాలం పూర్తి వరకు విత్తనాలకు సంబంధించిన రసీదును భద్రపరచుకోవాలని రైతులకు సూచించారు.యాజమాన్య పద్ధతులు, సలహాలు, సూచనల కొరకు వ్యవసాయ అధికారులను,శాస్త్రవేత్తలను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కావటి రామారావు,విస్తరణ అధికారి రాజ్యలక్ష్మి,రైతులు తదితరులు పాల్గొన్నారు.



## రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శిగా మల్లేష్ గౌడ్

**జయభేరి, షాద్ నగర్, నవంబర్ 15 :**

ఈనెల నవంబర్ 10 తేదీన కాటేదాన్ ప్రాంతంలో జరిగిన సిఐటియు రంగారెడ్డి జిల్లా 4 వ మహాసభలో నందిగామ మండలంలోని నాట్కో ఫార్మా కెమికల్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా పనిచేస్తున్న నవపేట్ మల్లేష్ గౌడ్ ని ఏకగ్రీవంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శిగా ఎన్నుకున్నట్టు ఆయన మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ; కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై సిఐటి యూ ఆధ్వర్యంలో ఐక్య పోరాటాలు నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా నాలుగు లేబర్ కోడులను రద్దు చేసే వరకు పోరాడుతామన్నారు. ఈ సందర్భంగా నాట్కో ఎంప్లాయిస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నవపేట్ మల్లేష్ గౌడ్ ను జిల్లా సహాయ కార్యదర్శిగా ఎన్నుకున్నందుకు నాట్కో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు..

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బ్యాగులు, నోట్ బుక్స్, పండ్లు పంపిణీ

**జయభేరి, కొండమల్లేపల్లి :**




కేఎంపీ హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో కొండమల్లేపల్లి మండల పరిధిలోని కొత్తభావి గ్రామ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు బ్యాగులు, కంపాక్స్ బాక్సులు, పెన్సిల్ బాక్స్ లు, పెన్నులు పంపిణీ చేయడం జరిగింది. కొండమల్లేపల్లి పట్టణం హైదరాబాదు రోడ్డులో గల ఎస్ వి మొబైల్స్, ఎలక్ట్రానిక్స్ యజమాని కూన భానుచందర్, ఏరుకొండ రాము. హోటల్ 7, జితేందర్ యాదవ్, నల్గొండ రోడ్డులోని ఎస్ వి మార్బుల్స్ యజమాని పి సైదులు తమ ఆర్థిక సహకారంతో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు కేఎంపి హెల్పింగ్ హాండ్స్ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా కేఎంపి హెల్పింగ్ హాండ్స్ సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయులు మంచి నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. బాలల దినోత్సవం వారోత్సవాలలో భాగంగా కొత్తబావి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కొంతమేర సహాయ సహకారాలు అందించామన్నారు. నేటి బాలలే రేపటి భావిభారత పౌరులని అన్నారు. ప్రతి ఒక్కరు ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నతంగా ఎదిగి తల్లిదండ్రులకు గురువులకు మంచి పేరు తేవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మా వంతుగా సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని ఈ సందర్భంగా సూచించారు. చదువుతోపాటు క్రీడలు, పాటలు, నృత్యం, సామాజిక సేవా కార్యక్రమా లలో పాలుపంచుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఏరుకొండ రాము, విప్పలపల్లి జితేందర్ యాదవ్, కూన భానుచందర్,దండు రవికుమార్,పి సైదులు, అలుగుబెల్లి నాగార్జున రెడ్డి, లక్ష్మీ మహారాజ్, పిల్లి కృష్ణ,మావిళ్ళ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## వినూత్న సందేశాత్మక ప్రేమ కథ చిత్రం ప్రేమిస్తున్నా

- హీరోయిన్ ప్రీతి నేహ అద్భుత నటనను ఆదరించండి
- చిత్రాన్ని తిలకించండి - తిరుపతి హీరోయిన్ ను ప్రోత్సహించండి
- హీరోయిన్ ప్రీతి నేహ తండ్రి కొట్టే శివకుమార్

**జయభేరి, తిరుపతి, నవంబర్ 15:**

తిరుపతికి చెందిన ప్రీతి నేహా హీరోయిన్ గా తొలిసారి నటించిన" ప్రేమిస్తున్నా, చిత్రాన్ని ఆదరించి తగిన ప్రోత్సాహం అందించాలని తిరుపతి జిల్లా ప్రజలకు హీరోయిన్ తండ్రి కొట్టే శివకుమార్ విజ్ఞప్తి చేశారు. తిరుపతి ప్రెస్ క్లబ్ లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీటీడీ ఫారెస్ట్ కాంట్రాక్టర్ గా పని చేస్తున్న తాను 20 సంవత్సరములుగా తిరుపతి సుందరీకరణలో భాగస్వాములై స్వామివారికి భక్తులకు అదేవిధంగా తిరుపతి ప్రజలకు సేవ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. తన కుమార్తె ప్రీతినేహ బెంగళూరులో బిబిఎ చదువుతూ ఉండగా ఆమె చురుకుతనం ,అందం చూసి తొలిసారిగా ప్రేమిస్తున్నా చిత్రంలో హీరోయిన్ గా అవకాశం దక్కిందని వివరించారు. ఇప్పటికే 96చిత్రాలలో బాల నటునిగా నటించిన హీరో సాత్విక్ వర్మ తొలిసారిగా హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో తన కుమార్తెకు కూడా తొలిసారిఅవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. తొలి చిత్రంలో నే తన అద్భుత నటన ప్రదర్శించడంతో మరో రెండు సినిమాలకు హీరోయిన్ గా అవకాశం దక్కిందన్నారు. తిరుపతి గ్రూప్ థియేటర్ శ్రీనివాసతేజలో ప్రదర్శిస్తున్న ఈ చిత్రాన్ని తిలకించి తన కుమార్తెను ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రేక్షకులు ఆదరించాలని ఆయన కోరారు. చిత్రాన్ని తిలకించిన ప్రతి ఒక్కరు ఏడుస్తూ తమ భావోద్వేగాన్ని పంచే విధంగా చిత్రాన్ని తీయడం జరిగిందన్నారు. గీతం స్కూల్ కరస్పాండెంట్ వెంకటేశ్వర్లు, లు మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో మానవ సంబంధాలు మృగ్యమై తాత్కాలిక శారీరక వాంఛతో ప్రేమలో పడి పెడదోవ పడుతున్న యువతను చైతన్యం చేసే విధంగా ప్రేమిస్తున్న చిత్రం వినూత్న సందేశాన్ని ఇస్తూ చిత్రీకరించడం జరిగిందన్నారు. వినూత్న ప్రేమ కథ చిత్రాన్ని ఆదరించి తిరుపతి హీరోయిన్ ప్రీతి నేహను ఆదరించాలని ఆయన కోరారు.

# స్కాలర్షిప్ లు ప్రభుత్వ బిక్ష కాదు విద్యార్థుల హక్కు

**జయభేరి, హైదరాబాద్, నవంబర్ 15 :**




అఖిల భారతీయ విద్యార్థి పరిషత్సికింద్రాబాద్ జిల్లా, మారేడుపల్లి శాఖ ఆధ్వర్యంలో స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు చెల్లించాలని విదార్థులతో భారీ నిరసనలు జరిపారు. ఈ సందర్భంగా ఎబివిపి సికింద్రాబాద్ జిల్లా కన్వీనర్ చెర్క బాలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టి రెండు సంవత్సరాలు పూర్తి కావస్తున్న గత 3 సంవత్సరాలుగా విద్యార్థులకు చెల్లించవలసిన స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు 8500 కోట్ల విడుదల చేయక విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతోందని సకాలంలో స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల కాకపోవటం వలన ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు కళాశాలలను మూసుకునే దుస్థితి దాపురించిందని, ప్రైవేటు విద్యాసంస్థలతో పాటు ప్రభుత్వం విద్యాసంస్థలు కూడా విద్యార్థులకు సర్టిఫికెట్స్ జారీ చేయటం లేదని ఫలితంగా విద్యార్థులు ఉన్నత విద్య కొనసాగించటంలేదని, స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ ప్రభుత్వ బిక్ష కాదని విద్యార్థుల హక్కు అని వెంటనే ప్రభుత్వం పెండింగ్లో ఉన్న 8500 కోట్ల స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయాలని లేని పక్షంలో ఎబివిపి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వనికి వ్యతిరేకంగా విద్యార్థుల పక్షాన భారీ స్థాయి ఉద్యమాలు చేస్తుందని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్డి హైదరాబాద్ మహానగర కన్వీనర్ పాండురంగ్,మారేడుపల్లి టౌన్ సెక్రటరీ కృష్ణ, వెంకట్, రామ్,శ్రీరామ్, రిషి, వినోద్, పవన్, తదితరులు విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీకి షాక్.. బిఆర్ఎస్ పార్టీలో చేరికలు

- ఎన్నికల హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం
- కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో సబ్బండవర్గాలు ఆందోళన బాట పట్టాయి
- స్వరాష్ట్రం ఏర్పడిన అనంతరం తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో పదేండ్ల పాటు అభివృద్ధి మార్గంలో పరుగులు తీసిన తెలంగాణ
- నేడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వల్ల సంక్షోభంలో కూరుకుపోయింది
- ప్రజాపాలన అంటూ ఎన్నికల్లో ఊదరగొట్టిన హస్తం పార్టీ నేతలు తెలంగాణలో సమస్యలను చెప్పుకునేందుకు కూడా అవకాశం లేకుండా చేశారు.
- ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ఎప్పుడో అటకెక్కించిన ప్రభుత్వ పెద్దలు బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన సంక్షేమ పథకాలకూ తిలోదకాలిచ్చారు.
- నమ్మించి నట్టేట ముంచిన సర్కారుపై ప్రజల్లో అడుగడుగునా ఆగ్రహావేశాలు పెల్లుబికాయి.
- పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటా.. స్థానిక ఎన్నికలలో సత్తాచాటాలి
- మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్



**జయభేరి, దేవరకొండ :**
ఎన్నికల హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందింది అని నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. శనివారం దేవరకొండ పట్టణంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గుడిపల్లి మండలం చిలుకమర్రి గ్రామానికి చెందిన దూదిపాల రాజేందర్ రెడ్డి తోపాటు 30కుటుంబాలు కాంగ్రెస్ పార్టీ నుంచి బిఆర్ఎస్ పార్టీలో బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ గారి సమక్షంలో చేరారు. పార్టీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ 2సంవత్సరాల పాలనలో సబ్బండవర్గాలు ఆందోళన బాట పట్టాయి అని ఆయన అన్నారు.స్వరాష్ట్రం ఏర్పడిన అనంతరం తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో పదేండ్ల పాటు అభివృద్ధి మార్గంలో పరుగులు తీసిన తెలంగాణ అని అన్నారు.నేడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వల్ల సంక్షోభంలో కూరుకుపోయింది అని తెలిపారు.నిరుద్యోగులు, రైతులు, విద్యార్థులు రోడ్డెక్కారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు అని అన్నారు.ప్రజాపాలన అంటూ ఎన్నికల్లో ఊదరగొట్టిన హస్తం పార్టీ నేతలు తెలంగాణలో సమస్యలను చెప్పుకునేందుకు కూడా అవకాశం లేకుండా చేశారు.ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ఎప్పుడో అటకెక్కించిన ప్రభుత్వ పెద్దలు బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన సంక్షేమ పథకాలకూ తిలోదకాలిచ్చారు అని అన్నారు.నమ్మించి నట్టేట ముంచిన సర్కారుపై ప్రజల్లో అడుగడుగునా ఆగ్రహావేశాలు పెల్లుబికాయి అని తెలిపారు.పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటా అని అన్నారు.స్థానిక ఎన్నికలలో సత్తాచాటాలి అని పిలుపునిచ్చారు.2 సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు రోడ్ల మీదకు వచ్చి నిరసనలు తెలిపే పరిస్థితి వచ్చింది అని ఆయన అన్నారు బడికి పోయే పిల్లల నుండి పింఛన్లు అందుకునే అవ్వా తాతల దాకా రోడ్లు ఎక్కారంటే ఆ ఘనత రేవంత్ రెడ్డిదే అని తెలిపారు.కేసీఆర్ బతుకమ్మ పండుగ వేల చీరెలు ఇచ్చిండు. కేసీఆర్ కిట్లు, న్యూట్రీషన్ కిట్లు ఇచ్చిండు, చెరువుల్లో చేపలు వేసిండు. గొర్రెలు ఇచ్చిండు కేసీఆర్ ప్రభుత్వం పోయాక అన్నీ పోయాయి అని అన్నారు. నేడు 10వేలు, రేపయితే 15వేల రైతు భరోసా అన్నరు. బోనస్ 500 ఇస్తడు అన్నడు ఎగ్గొట్టిండు అని అన్నారు. వృద్ధులకు 4వేల పింఛన్ ఇస్తా అని మాట తప్పిండు ఇచ్చే రెండు వేల పింఛన్ కూడా రెండు నెలలు ఎగ్గొట్టిండు అని గుర్తు చేశారు.పింఛన్లు దగా రైతులకు బోనస్ దగా,రుణమాపీ దగా,తులం బంగారం దగా,విద్యార్థులకు జాబ్స్ దగా,మహిళలకు 2500 దగా, అన్నీ దగా ఎనుముల రేవంత్ రెడ్డి కాదు, ఎగవేతల రెడ్డి చీఫ్ మినిస్టర్ కాదు, చీటింగ్ మ్యాన్ అన్ని పంటలకు బోనస్ అని మోసం చేసిండు అని ఆయన తెలిపారు.కాంగ్రెస్ వికృత వైఖరి పట్ల గ్రామ గ్రామాన చర్చలు పెట్టాలి. ప్రజలు, రైతులు, యువత అందరికీ అర్థమయ్యేలా వివరించాలి అని పిలుపు నిచ్చారు.రేవంత్ రెడ్డి చేసిన అప్పుతో ఢిల్లీకి మూటలు కట్టుడు తప్ప ఎం చేసాడు సమాధానం ఉందా అని ఆయన అన్నారు. పార్టీలో చేరిన వారిలో లోకసాని శ్రీనివాస్ రెడ్డి,జేటామోని రాములు, దూదిపాల మాధవ రెడ్డి, తేలుకుంట్ల వెంకట్ రెడ్డి, మారేపల్లి లింగయ్య, దూదిపాల దామోదర్ రెడ్డి, ఇరిగి మహేష్, లింగయ్య,చంద్రమౌళి, వెంకటేష్, తిరుమల్, నగేశ్, వాసుదేవ రెడ్డి , నర్సింహ, యాదగిరి,రమేష్, వెంకటయ్య, ఇరిగీ తిరుమల్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు వెల్లుగూరి వల్లపు రెడ్డి, మునగాల అంజి రెడ్డి,టీ అర్వపల్లి నర్సింహ, తోటకూరి పరమేష్,ఎర్ర యాదగిరి, గోలి గిరి, కూన్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి, కృష్ణా రెడ్డి, రామావత్ దామోదర్, కర్నాటి రవి,వంశీ, వెంకటయ్య, సత్తయ్య,తదితరులు పాల్గొన్నారు.





## జన్ జాతీయ దివస్

**జయభేరి, దేవరకొండ :**
బిర్సా ముండా 1875—1900 పాతికేళ్లు కూడా నిండని పోరాట యోధుడు. స్వాతంత్ర్య పోరాటంలో ఆంగ్లేయులపై పిడికిలి బిగించిన గిరిజన నాయకుడు అతని ధైర్యసాహసాలను స్మరించుకుంటూ భారత ప్రభుత్వం నవంబర్ 15 వ తేదీని జన్ జాతీయ గౌరవ దివస్ గా ప్రకటించింది. 150 వ జయంతి సందర్భంగా DTWO ఆధ్వర్యంలో దేవరకొండ బంజారా భవన్ లో జరిగిన కార్యక్రమం లో పాల్గొన్న దేవరకొండ నియోజకవర్గం బంజారా సేవ సంఘం అధ్యక్షులు కేతావత్ లక్ష్మానాయక్ , DTWO MPDO , జిల్లా ప్రెసిడెంట్ ప్రవీణ్ నాయక్ , శంకర్ నాయక్ , పాండు నాయక్ , పాప నాయక్ , లక్పతి తదితరులు పాల్గొన్నారు.

## ఆంజనేయ స్వామి పూజలో పాల్గొన్న కేతావత్ భిల్యా నాయక్



**జయభేరి, చింతపల్లి :**
చింతపల్లి మండలం ప్రశాంతపూరి తండకు చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు కేతావత్ శ్రీను నాయక్ కుర్మెడు గేటు పై గల నూతన గృహం లో ఆంజనేయ స్వామి పూజలో పాల్గొన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ భిల్యా నాయక్. ఈ కార్యక్రమంలో కేతావత్ శ్రీను నాయక్, కిరణ్ నాయక్, రమేష్ స్వామి,చందు స్వామి, జైపాల్ నాయక్,చారి, ఆంజనేయ, అయ్యప్ప స్వాములు తదితరులు పాల్గొన్నారు.



## ఈనెల 19న పీఎం కిసాన్ నిధులు!

**జయభేరి, న్యూఢిల్లీ:**
ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పీఎం కిసాన్, యోజన పథకం 21వ వాయిదా సొమ్ము ఈ నెల 19న రైతన్నల బ్యాంకు ఖాతాలకు జమ అవుతుంది. ఈ సొమ్మును ప్రధాని మోదీ విడుదల చేస్తారని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. ఈ పథకం క్రింద అర్హులైన అన్నదాతలకు సంవత్సరానికి రూ.6,000 మూడు విడతల్లో అందజేస్తున్న సంగతి తెలిసిందే.

## జహీరాబాద్ లో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్

**జయభేరి, సంగారెడ్డి:**
జహీరాబాద్లో డీఎస్పీ సైదా నాయక్ నేతృత్వంలో పోలీసుల కార్డన్ సెర్చ్ జరిగింది. సోదాల్లో పోలీసులకు ఓ వ్యక్తి వద్ద ఎయిర్ గన్, దుప్పి కొమ్ములు లభ్యం అయింది. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని 32 బైకులు, 14 ఆటోలు, రెండు కార్లు స్వాధీనం చేసుకున్నారు.

## ముంపు ప్రాంతాలను పరిశీలించిన మంత్రి పొన్నం

**జయభేరి, హుస్నాబాద్:**
భారీ వర్షాలకు ముంపుకు గురైన హుస్నాబాద్ బస్ స్టేషన్ ప్రాంతాలను మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. హుస్నాబాద్ బస్ స్టేషన్ లో భారీ వర్షాలకు నీట్ మునగడంతో శాశ్వత పరిష్కారం చేసేలా అధికారులకు పలు సూచనలు చేసారు. బస్ స్టేషన్ వెనుక వైపు ఉన్న డ్రైనేజీ లోకి బస్ స్టాండ్ వరద నీరు పోయేలా లింక్ కాలువ ఏర్పాటు చేయాలని సూచించారు. బస్ స్టేషన్ లో భవిష్యత్ ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. తరువాత మంత్రి హుస్నాబాద్ మార్కెట్ కమిటీ సందర్శించారు. ధాన్యం కొనుగోలు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ధాన్యం లోడ్ అయిన 48 గంటల్లో రైతుల ఖాతాలో డబ్బులు జమ అయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేశామని వారి ఖాతాలో డబ్బులు కూడా జమ అయ్యాయని వెల్లడించారు.

## ముత్తిగూడెం హైస్కూలు ను తనిఖీ చేసిన కలెక్టర్

**జయభేరి, యాదాద్రి భువనగిరి జిల్లా :**
యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం ముత్తిరెడ్డి గూడెం లో జిల్లా పరిషత్ హైస్కూల్ ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్.స్కూల్ లో మధ్యాన్న భోజనంలో విద్యార్థులకి ఈరోజు ఇచ్చే భోజనం తనికి చేశారు. విద్యార్థులకి ఇచ్చే ఆహారంలో సరిపడా పప్పు లేదు, కూరగాయలు కూడా ఎక్కువగా లేవు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పద్ధతి మార్చుకోకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.రోజు విద్యార్థులకి మెనూ ప్రకారం ఇవ్వాల్సిన ఆహారాన్ని ఇవ్వాలని ఆదేశించారు . స్కూల్ లో విద్యార్థులతో కలిసి వాలీబాల్ ఆడిన కలెక్టర్,జిల్లా స్థాయిలో జరిగిన వాలీబాల్ పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థుల్ని అభినందించారు.

# సిపిఐ పార్టీ శతజయంతి

- ఉత్సవాలను గ్రామ గ్రామన నిర్వహించండి
- నియోజకవర్గంలో సీపీఐ జీపు జాతాను ప్రారంభిద్దాం
- సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు పిలుపు




**జయభేరి, షాద్ నగర్, నవంబర్ 15 :**
సిపిఐ శతజయంతి ఉత్సవాలను సిపిఐ గ్రామ శాఖలలో మండల కేంద్రాలలో ఘనంగా నిర్వహించాలని అలాగే సిపిఐ జీపు జాతను చేపట్టాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం. శ్రీను అధ్యక్షతన శనివారం షాద్ నగర్ నియోజకవర్గ సమావేశం జరిగింది ఈ సమావేశానికి రాష్ట్ర సమితి సభ్యుడు బుద్ధుల జంగయ్య తో కలిసి ఆయన పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ; భారత దేశంలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి 100 సంవత్సరాలు అవుతున్నదని 100 సంవత్సరాల శత జయంతి ఉత్సవాలను దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో మన షాద్ నగర్ నియోజకవర్గంలో కూడా ఘనంగా నిర్వహించాలని ఆయన పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సిపిఐ ఏర్పడిన తర్వాత భారత దేశంలో భూస్వాములకు వ్యతిరేకంగా దోపిడీదారులకు వ్యతిరేకంగా ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతూనే ప్రజలకు అండగా నిలిచిన పార్టీ సిపిఐ పార్టీ అని ఆయన అన్నారు.
డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభకు షాద్నగర్ నుండి పెద్ద ఎత్తున పార్టీ కార్యకర్తలు ప్రజలు తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు జంగయ్య మాట్లాడారు.
కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం శ్రీను మండల కార్యదర్శి ఎం గోవింద్ నాయక్ వెంకటేష్, ఎండి షకిల్ గడ్డం జంగయ్య ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం పవన్ చౌహాన్, సహాయ కార్యదర్శి ఆకాష్, ఏఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి చంద్రబాబు బీకేఎంయు జిల్లా నాయకుడు డి. ఎల్లయ్య ,సీనియర్ నాయకురాలు యామిని తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర వ్యాప్తంగా చెరువుల్లో నాణ్యమైన చేప పిల్లల పంపిణీ


- హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువులో 5.17 లక్షల రూపాయలతో 3 లక్షల చేప పిల్లల విడుదల



**హుస్నాబాద్:**
చేప పిల్లల పంపిణీ పారదర్శకంగా ఉండేలా చెరువుల వద్ద సైన్ బోర్డుల ఏర్పాటు. హుస్నాబాద్ పశువైద్య శాల ఆధునీకరణ చేపల మార్కెట్, స్టోరేజ్ సెంటర్,పాల శీతలీకరణ కేంద్రం ఏర్పాటు చేస్తాం. హుస్నాబాద్ టూరిజం గా అభివృద్ధి చేసి మత్స్య సంపద ద్వారా ఆర్థిక వృద్ధి సాధించేలా చర్యలు చేపల పంపిణీ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి హుస్నాబాద్ లో మత్స్య సంపద మరింత అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటామని సిద్ధిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలోని ఎల్లమ్మ చెరువులో చేప పిల్లల విడుదల కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి,ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ లు వెల్లడించారు. హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు లో 5.17 లక్షల రూపాయలతో 3 లక్షల చేప పిల్లలు విడుదల చేశారు.ఎల్లమ్మ చెరువులో ఉచిత చేప పిల్లల పంపిణీ ద్వారా 253 మంది మత్స్య కారుల కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది.నియోజకవర్గం మొత్తం 165 చెరువులకు గాను 38 లక్షల 92 వేల ఉచిత చేప పిల్లలు విడుదల చేయనున్నారు.ఈ పథకం వల్ల నియోజకవర్గంలో 4,144 మంది మత్స్య కారుల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుంది. ఉచిత చేప పిల్లల పంపిణీ ద్వారా మత్స్య కారులను ఆర్థికంగా బలోపేతం చేసి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో మత్స్య శాఖ కీలకంగా మారేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. ఇప్పటికే నియోజకవర్గంలో ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళా సంఘాలకు 3 మొబైల్ ఫిష్ రిటైల్ అవుట్లెట్ అందించడం జరిగింది. అంతేకాకుండా ప్రమాదవశాత్తు మత్స్యకారులు మరణిస్తే వారికి గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకొని వచ్చి 5లక్షల రూపాయలు బీమా కల్పిస్తూ వారికి కుటుంబానికి భరోసా కల్పిస్తుంది.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ. హుస్నాబాద్ లో వెటర్నరీ హాస్పిటల్ నూతన భవనాన్ని నిర్మించి అధునాతన వెటర్నరీ హాస్పిటల్ నిర్మించాలని, అదేవిధంగా అసంపూర్తిగా ఉన్న మోడర్న్ చేపల మార్కెట్ ను పూర్తి చేయాలని ,వెటర్నరీ డాక్టర్ పోస్టు మంజూరు చేయాలని,గోపాల మిత్ర సమస్యలు పరిష్కరించాలని మత్స్య పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి కి మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తికి స్పందించి హుస్నాబాద్ పశువైద్య శాల ఆధునీకరణ , చేపల మార్కెట్, స్టోరేజ్ సెంటర్, పాల శీతలీకరణ కేంద్రం ఏర్పాటు చేస్తామని మంత్రి వాకిటి శ్రీహరి హామీ ఇచ్చారు. గురుకులాల్లో మటన్, చికెన్ లాగా చేపలు కూడా మెనూ ఉండాలని ఇటీవల మంత్రి వాకిటి శ్రీహరి లేవనెత్తిన అంశాలు గురుకులాల్లో మెనూ లో చేపలు కూడా ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువులో 3 లక్షల చేప పిల్లలు వేయగా ఇంకో 60 వేల చేప పిల్లలు,రొయ్యలు వేయాలని కోరారు. హుస్నాబాద్ టూరిజం అభివృద్ధి చేస్తున్నామని ఇక్కడికి వచ్చే వారు చేపలు కొనేలా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. ఎప్పుడూ నియోజకవర్గం గురించి ఆలోచించే వ్యక్తి పొన్నం ప్రభాకర్ అని కొనియాడారు.మత్స్య శాఖకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 123 కోట్లు కేటాయించారనీ దానికి మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఈ బడ్జెట్ లో 84 కోట్ల చేపపిల్లలు 10 కోట్ల రొయ్య పిల్లలు రాష్ట్రంలో ఉన్న 26వేల నీటి వనరుల్లో ఉచిత చేప పిల్లల పంపిణీ చేయడం జరుగుతుందనీ వెల్లడించారు. గతంలో చేపపిల్లల పంపిణీలో విషయంలో అవకతవకలు జరిగాయని ఈసారి ఏ చేప దాని సైజు, అవి ఎన్ని చేప పిల్లలు అని తెలిపేలా పారదర్శత కోసం చెరువుల వద్ద సైన్ ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.

## ఐ బొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవి అరెస్టు

- కరేబియన్ దీవుల నుంచి వెబ్‌సైట్ నిర్వహణ




**జయభేరి, హైదరాబాద్, నవంబర్ 15:**
సినిమాలను, వెబ్‌సిరీస్‌లను పైరసీ చేస్తూ వెబ్‌సైట్ లో పెట్టిన ఐ బొమ్మ(ప్రస్తుతం బప్పమ్ టీవీ) నిర్వాహకుడు ఇమ్మడి రవిని పోలీసులు అరెస్టు చేశారు. పైరసీ విషయంలో పోలీసులకు గతంలో అతను సవాల్ చేశాడు. దమ్ముంటే పట్టుకోవాలని, అందరి పర్సనల్ వివరాలు బయటపెడతానంటూ బెదిరించాడు. ఈ బెదిరింపును పోలీసులు సీరియస్‌గా తీసుకొని ఇన్నిరోజులు కాపు కాసి ఆయన్ని పట్టుకున్నారు. హైదరాబాద్‌లోని కుకట్‌పల్లిలో అతన్ని అదుపులోకి తీసుకున్నారు.ప్రపంచవ్యాప్తంగా విడుదలైన సినిమాలను అదే రోజు వెబ్‌సైట్‌లో పెడుతూ తీవ్ర చర్చనీయాంశమైందీ ఐ బొమ్మ పైరేటెడ్ వెబ్‌సైట్. ఈ అంశం ప్రస్తావనకు వచ్చిన ప్రతిసారి కూడా ఈ వెబ్‌సైట్ పేరు సినిమా నిర్మాతల మధ్య చర్చకు వచ్చేది. పోలీసులకు నిర్మాతల మండలి ఫిర్యాదులు చేసేది. కానీ ఇంత వరకు సీరియస్‌గా యాక్షన్ తీసుకున్నది లేదు. ఈ మధ్యకాలంలో సినిమా పరిశ్రమ నుంచి ఒత్తిడి రావడంతో పోలీసులు గట్టి చర్యలు ప్రారంభించారు. అందులో భాగంగా నెల రోజుల క్రితం కీలకమైన ఓ ముఠాను అరెస్టు చేశారు.ఐదుగురు సభ్యులు ఉన్న ముఠాను అరెస్టు చేసిన సందర్భంగా అప్పటి సీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ పైరసీ వెబ్‌సైట్‌లు ఎలాంటి టెక్నాలజీ ఉపయోగించినా సరే పట్టుకుంటామని అన్నారు. ముఖ్యంగా ఐ బొమ్మ వంటి సంస్థలను వదిలిపెట్టేదేలేదని హెచ్చరించారు. పోలీసులు ఈ హెచ్చరిక జారీ చేసిన వెంటనే ఐబొమ్మ పోలీసులకు సవాల్ చేసింది. దమ్ముంటే తమను పట్టుకోవాలని ఛాలెంజ్ చేసింది. తమను పట్టుకుంటే ఎవరిని ఎక్కడ ఫోకస్ చేయాలో తమకు తెలుసని చెప్పుకొచ్చింది. అంతే కాకుండా తమ దగ్గర చాలా మంది ప్రైవేటు డేటా ఉందంటూ బెదిరింపులకు దిగింది. మొత్తాన్ని ఇన్ని రోజులు విచారణ చేసిన పోలీసులు కీలక వ్యక్తిని అరెస్టు చేశారు. కరేబియన్ దీవుల్లో ఉంటూ అక్కడి నుంచి ఈ పైరసీ సినిమాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తూ వచ్చారు. ఫ్రాన్స్‌లో ఉంటూ సినిమా వాళ్లకు చుక్కలు చూపించాడు రవి. ఫ్రాన్స్ నుంచి వచ్చిన వెంటనే ఇతన్ని అదుపులోకి తీసుకున్నారు. థియేటర్లలో లేదా OTTలో సినిమా రిలీజ్ అయిన వెంటనే అప్‌లోడ్ చేస్తున్నాడు. దీనివల్ల సినిమా నిర్మాతలు భారీగా నష్టపోతున్నారు. ఇప్పటికే ఈ వెబ్‌సైట్‌పై వందల ఫిర్యాదులు ఉన్నాయి. వీళ్లంతా కూడా విదేశాల్లో ఉంటూ సినిమాలు పైరసీ చేస్తుండటంతో పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేకపోతున్నారు. అలాంటి వాళ్లు దేశానికి వచ్చినప్పుడు మాత్రమే అరెస్టు చేయగలుగుతున్నారు. పైరసీ ఈ స్థాయిలో పెరిగిపోవడానికి ఇది కూడా కారణమని పోలీసులు చెబుతున్నారు. రవి భార్య నుంచి విడాకులు తీసుకొని ఒంటరిగా ఉంటున్నాడు. ఫ్రాన్స్‌లో ఉంటూ వివిధ దేశాల్లో తన నెట్‌వర్క్‌ను విస్తరించాడు. ముఖ్యంగా కరేబియన్ దీవుల నుంచి వెబ్‌సైట్‌ను మేనేజ్ చేస్తూ వచ్చాడు. ఈ విషయాలు తెలిసినప్పటికీ పోలీసులు ఏం చేయలేని పరిస్థితి ఏర్పడింది. మరోవైపు ఆయన్ని అరెస్టు చేసిన తర్వాత కీలక విషయాలు తెలుసుకున్నారు. అతని వద్ద లెటెస్ట్ సినిమాలకు సంబంధించిన వివరాలు, ప్రింట్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఆయన అకౌంట్‌లో ఉన్న 3 కోట్ల రూపాయలను కూడా అధికారులు ఫ్రీజ్ చేశారు.

## సాగర్ ఆసుపత్రిలో ఇంజక్షన్ వికటించి చిన్నారులకు అస్వస్థత


**జయభేరి, నల్లగొండ:**
నాగార్జునసాగర్ ప్రభుత్వ దావఖానలో ఇంజక్షన్ వికటించి 17 మంది చిన్నారులు అస్వస్థతకు గురయ్యారు. ప్రభుత్వ ఆస్పటల్ లో పిల్లల వార్డ్ లో రోజు మాదిరిగానే రాత్రి పిల్లలకు డాక్టర్లు ఇంజక్షన్ ఇచ్చారు. వైద్యం వికటించి ఇంజక్షన్ ఇచ్చిన 30 నిమిషాల తర్వాత పిల్లలకు విపరీతమైన జ్వరం,వాంతులు, విరోచనాలు అయ్యాయి. రాత్రి నుండి ఇప్పటివరకు పిల్లలకు వాంతులు విరోచనాలు తగ్గకపోవడంతో ఐసీయూలో ప్రభుత్వ హాస్పిటల్స్ సిబ్బంది ట్రీట్మెంట్ చేయిస్తున్నారు. జ్వరం ఇంజక్షన్ బదులు వేరే ఇంజక్షన్ ఇచ్చారంటూ డ్యూటీ డాక్టర్ లతో పిల్లల తల్లిదండ్రులు ఘర్షణకు దిగారు.



# అంచనాలను నిజం చేసింది

'కాంత' చిత్రానికి అద్భుతమైన స్పందన లభిస్తున్నదని, చాలా గ్యాప్ తర్వాత స్క్రీన్ మీద కనిపించడంతో అభిమానులు హ్యాపీగా ఫీలవుతున్నారని అన్నారు హీరో రానా. ఆయన దుల్కర్ సల్మాన్‌తో కలిసి నటించిన పీరియాడిక్ ఎంటర్‌టైనర్ 'కాంత' ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో రానా మాట్లాడారు. ఈ సినిమాలో దుల్కర్ సల్మాన్ కెరీర్ బెస్ట్ పర్ఫార్మెన్స్ కనబరిచారని, విజువల్స్, మ్యూజిక్‌లాంటి అంశాలు ఉన్నత ప్రమాణాలతో ఉన్నాయనే ప్రశంసలొస్తున్నాయని చెప్పారు. 'ఇండిపెండెంట్ ఆర్ట్ సినిమాలంటే నాకూ, దుల్కర్‌కు బాగా ఇష్టం. అందుకే ఈ సినిమాను సంయుక్తంగా నిర్మించాం. మా టీమ్ అందరి అంచనాలను నిజం చేసిన చిత్రమిది. ఇది ఏ నటుడి బయోపిక్ కాదు. 50 దశకం నాటి కథ కాబట్టి అప్పటి సినిమాల రిఫరెన్స్‌లను చూపించాం' అన్నారు. తనకు చిన్నప్పటి నుంచి పాత సినిమాలంటే ఇష్టమని, ఈ సినిమా కోసం సావిత్రి, శ్రీదేవి నటించిన చిత్రాల్ని చూశానని కథానాయిక భాగ్యశ్రీ బోర్సే చెప్పింది.

# తర్వాత సినిమా బోయపాటితో?



అల్లు అర్జున్ ప్రస్తుతం అట్లీ దర్శకత్వంలో పాన్ ఇండియా సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ అనుకున్న దానికంటే ముందే పూర్తి కానున్నదని సమాచారం. మరి ఈ సినిమా తర్వాత బన్నీ ఎవరితో చేస్తారు? అనేది ఇప్పుడు ఫిల్మ్ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఇప్పటికే కొంతమంది దర్శకులతో బన్నీ సంప్రదింపులు కూడా మొదలుపెట్టినట్టు సమాచారం. ఆ వరుసలో బోయపాటి శ్రీను ముందున్నట్టు తెలిసింది. అట్లీ సినిమా తర్వాత అల్లు అర్జున్ నటించేది బోయపాటి దర్శకత్వంలోనే అని ఆయన సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. అల్లు అర్జున్, బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో 'సరైనోడు' సినిమా వచ్చింది. అప్పటివరకూ బన్నీ కెరీర్‌లో అదే పెద్ద హిట్. ఆ సినిమాకు సీక్వెల్ కూడా ఉంటుందని అప్పట్లో టాక్ నడిచింది. కానీ బన్నీ, బోయపాటి ఎవరి ప్రాజెక్టుల్లో వాళ్లు బిజీ అయిపోయారు. ప్రస్తుతం బోయపాటి 'అఖండ 2' వచ్చే నెలలో వచ్చేస్తున్నది. ఆ సినిమా తర్వాత ఆయన బన్నీ కథపైనే కసరత్తులు మొదలుపెడతారట. ఈలోపు అట్లీ సినిమా పూర్తి చేసి, ఏ మాత్రం ఆలస్యం చేయకుండా కొత్త సినిమా షూట్‌లోకి బన్నీ ఎంట్రీ ఇస్తారని అంతరంగిక వర్గాల సమాచారం.



# ఈ చిన్నది పసుపు రంగు చీరలో

ఇక దర్శకుడు రాజమౌళి కొన్ని రోజుల పాటు, మూవీకి సంబంధించిన ఎలాంటి ఇన్ఫర్మేషన్ అభిమానులకు ఇవ్వలేదు. చాలా సీక్రెట్‌గా సినిమా షూటింగ్ జరిపించేశాడు. కానీ ఈ మధ్య వరసగా సినిమాకు సంబంధించిన అప్డేట్స్ ఇస్తూ, మహేష్ బాబు అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపుతున్నాడు. అయితే సూపర్ స్టార్ మహేష్ బాబు, రాజమౌళి కాంబోలో వస్తున్న ఈ సినిమాలో ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా చేస్తుంది. దీనికి సంబంధించిన పోస్టర్ చిత్ర బృదం రిలీజ్ చేసిన తర్వాత ఓ ఇంట్రెస్టింగ్ న్యూస్ నెట్టింట చక్కర్లు కొడుతుంది. అది ఏమిటంటే. ఇప్పటికే ప్రియాంక చోప్రా, మహేష్ బాబు కాంబోలో ఓ సినిమా మిస్ అయ్యిందంట. ఇంతకీ ఆ మూవీ ఏదో ఇప్పుడు చూద్దాం. చిత్ర పరిశ్రమలో చాలా కాంబోలు మిస్ అవుతుంటాయి. అలాగే, మహేష్ బాబు, ప్రియాంక చోప్రా కాంబోలో కూడా ఓ డిజాస్టర్ మూవీ మిస్ అయ్యిందంట. ఇంతకీ ఆ చిత్రం ఏదో కాదు, నాని మూవీ. ఎస్ జే సూర్య దర్శకత్వంలో మహేష్ బాబు, అమీషా పటేల్ జంటగా నటించిన మూవీ నాని. ఈ సినిమా ఎన్నో అంచనాల మధ్య రిలీజై డిజాస్టర్ అయిన విషయం తెలిసిందే. అయితే ఈ మూవీలో హీరోయిన్ పాత్ర కోసం ముందుగా చిత్ర బృదం ప్రియాంక చోప్రాను సంప్రదించారంట. ఆమెకు కూడా మహేష్ బాబుతో నటించాలనే ఇంట్రెస్ట్ ఉండటంతో అవకాశం రాగానే మూవీకి ఒకే చెప్పిందంట. కానీ తర్వాత డేట్స్ సర్దు బాటు కాకపోవడంతో,ఈ బ్యూటీ నాని సినిమాలో అవకాశాన్ని చేజార్చుకుంది. అలా మహేష్ బాబు, ప్రియాంక చోప్రా కాంబోలో రావాల్సిన నాని సినిమా మిస్ అయ్యింది. అప్పుడు ఈ కాంబినేషన్ మిస్ అయినా, మళ్లీ ఇప్పుడు వరల్డ్ ప్రాజెక్ట్‌లో ఈ కాంబో రిపీట్ కానుంది. ప్రస్తుతం దీనికి సబంధించిన న్యూస్ నెట్టింట తెగ వైరల్ అవుతుంది.



# ఆరాధన అందరికి గుర్తుండిపోతుంది

'పొలిమేర' 'ఇట్లు మారేడుమిల్లి' వంటి చిత్రాల ద్వారా తెలుగు ప్రేక్షకులకు చేరువైంది తెలుగమ్మాయి కామాక్షి భాస్కర్ల. ఆమె అల్లరి నరేష్ సరసన కథానాయికగా నటించిన తాజా చిత్రం '12ఏ రైల్వే కాలనీ' ఈ నెల 21న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా శనివారం కామాక్షి భాస్కర్ల విలేకరులతో ముచ్చటించింది. ఈ సినిమాలో తన పాత్రపేరు ఆరాధన అని, ఆమె ఎక్కడి నుంచి వచ్చింది? ఏం చేస్తుందనే అంశాలు ఇంట్రెస్టింగ్‌గా అనిపిస్తాయని చెప్పింది. తన పాత్ర కథాగమనంలో చాలా కీలకంగా ఉంటుందని, ఆరాధన లేకపోతే సినిమా కథే లేదని, అందరికి గుర్తుండిపోయే పాత్ర అవుతుందని తెలిపింది. 'హీరోలు అన్ని రకాల పాత్రలు చేస్తున్నారు. కానీ నాయికల విషయంలో పరిమితులు కనిపిస్తాయి. అందుకే ప్రతి సినిమాలో ఛాలెంజింగ్ రోల్స్ ఎంచుకుంటున్నా. నేను అపోలో హాస్పిటల్‌లో జనరల్ ఫిజీషియన్‌గా ప్రాక్టీస్ చేశాను. ఇప్పుడు మాత్రం పూర్తిగా నటనకే సమయాన్ని కేటాయిస్తున్నా' అని చెప్పింది. ప్రస్తుతం తాను 'డెకాయిట్' చిత్రంలో నటిస్తున్నానని, మరో పెద్ద సినిమా ప్రకటన త్వరలో వస్తుందని, అలాగే 'పొలిమేర3' కూడా ప్రారంభం అవుతుందని కామాక్షి భాస్కర్ల పేర్కొంది.

# త్రిశూలం పట్టిన రాముడిగాథ వారణాసి

## కీలకంగా రామాయణ ఘట్టం.. 2027 వేసవిలో రిలీజ్




'మహాభారతం, రామాయణం అంటే నాకు చాలా ఇష్టం. ఈ సినిమా మొదలుపెట్టినప్పుడు రామాయణంలోని ఓ ఘట్టం తీస్తానని అనుకోలేదు. ఒక్కొక్క సీన్ తీస్తుంటే నేను నేలపై లేను.. గాలిలో ఉన్నాననిపించింది. ఫస్ట్‌టైమ్ మహేశ్‌ని రాముడి వేషంలో ఫొటో షూట్ చేస్తుంటే గూజ్‌బంప్స్ వచ్చాయి. మహేశ్ కొంటెగా ఉంటాడు. కృష్ణుడిగా బావుంటాడనుకుంటూనే ఫొటో షూట్ చేశాం. కానీ రాముడిగా అత్యద్భుతంగా ఉన్నాడు' అని అన్నారు అగ్ర దర్శకుడు రాజమౌళి. మహేశ్‌బాబు కథానాయకుడిగా ఆయన దర్శకత్వంలో దుర్గా ఆర్ట్స్ పతాకంపై కె.ఎల్.నారాయణ నిర్మిస్తున్న ఈ భారీ పాన్ వరల్డ్ మూవీకి 'వారణాసి' అనే పేరును ఖరారు చేశారు. శనివారం హైదరాబాద్ ఆర్ఎఫ్‌సీలో 'గ్లోబ్ ట్రాటర్' పేరిట నిర్వహించిన ఈ సినిమా భారీ ఈవెంట్‌లో వేలాది అభిమానుల సమక్షంలో టైటిల్‌ను, గ్లింప్స్‌ను విడుదల చేశారు. వీడియో గ్లింప్స్‌లో మహేశ్‌బాబు నందిపై త్రిశూలాన్ని చేతబూని ఉగ్రరూపంలో వస్తూ కనిపించారు.

ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ 'నేను చిన్నప్పట్నుంచీ ఎన్టీఆర్ అభిమానిని. అయితే.. సినిమా అంటే ఏంటో తెలిశాక కృష్ణ గొప్పతనం అర్థమైంది. తెలుగు సినిమాను టెక్నాలజీ పరంగా ముందుకు తీసుకెళ్లింది ఆయనే. అలాంటి కృష్ణ అబ్బాయితో సినిమా తీస్తూ ఎలాంటి సినిమా చేయాలి? సాంకేతికంగా ఎలా ఉండాలి? ఆ ప్రశ్నలకు సమాధానమే ఈ సినిమా. ఇండియాలో ఫస్ట్ ఫుల్ స్క్రీన్ ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో ఈ సినిమా రూపొందుతున్నది. ఈ సినిమాలో ప్రతీది కొత్తగా ఉండేలా ప్లాన్‌చేశాం. అన్నింటినీ దాటుకుంటూ రాముడి తాలూకు సీక్వెన్స్‌ని కంప్లీట్ చేశాం. నా కెరీర్‌లోనే కాదు, మహేశ్ కెరీర్‌లో కూడా మోస్ట్ మెమొరబుల్ సీక్వెన్స్ అది. రాముడిగా మహేష్‌బాబు మీరు ఊహించిన దానికంటే దయార్ద్ర హృదయంతో కనిపిస్తాడు.. దివ్యమంగళంగా అనిపిస్తాడు.. ఉగ్రరూపంలో మెరిపిస్తాడు. త్వరలోనే ట్రైలర్‌తో వస్తాం' అని అన్నారు. మహేష్‌బాబు మాట్లాడుతూ 'ఈ స్టేజీ మీదకు సింపుల్‌గా నడిచి వస్తానంటే రాజమౌళి కుదరదని చెప్పాడు. ఇలా కొత్తగా డ్రెస్ డిజైన్ చేశారు. ఇదంతా మీకోసమే. ఈ గ్లింప్స్ గురించి నా డైలాగ్‌లో చెప్పాలంటే.. దిమ్మతిరిగి మైండ్‌బ్లాక్ అయింది. నేను పౌరాణిక సినిమాల్లో బాగుంటానని నాన్నగారు ఎప్పుడూ చెప్పేవారు. ఎందుకోగానీ నేను ఆయన మాట వినలేదు. కానీ ఈ సినిమాలో ఆయన మాటను పాటించాను. ఈ సినిమా నా డ్రీమ్ ప్రాజెక్ట్. జీవితకాలంలో ఒకేసారి వరించే అవకాశం. ఈ సినిమా కోసం ఎంతకష్టమైనా పడతాను. ఇది రిలీజైనప్పుడు భారతదేశం మొత్తం గర్వంగా ఫీలవుతుంది. ముందుముందు ఈ సినిమా ఎలా ఉండబోతున్నదో మీ ఊహకే వదిలేస్తున్నా' అన్నారు. దిగ్గజ కళాకారులు, సాంకేతిక నిపుణులతో కలిసి ఈ సినిమాలో భాగం కావడం అదృష్టంగా భావిస్తున్నానని కథానాయిక ప్రియాంకచోప్రా పేర్కొంది. ఇంకా పృథ్వీరాజ్ సుకుమార్, ఎం.ఎం.కీరవాణి, రచయిత విజయేంద్రప్రసాద్ కూడా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇటీవలే దివంగతులైన తెలంగాణ ప్రజాకవి అందెశ్రీకి చిత్రబృందం నివాళులు అర్పించారు.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**